

జగడం!

రాధా వర్సెస్ ఎంసీఎం.. ఎంసీఎం వర్సెస్ రైతులు

తమ భూభాగంలో కొనుగోలు చేసిన ల్యాంకో యూనిట్‌ను ఖాళీ చేయలేదని..

- నెలకు రూ.2.50 కోట్లు చెల్లించాలని ఎంసీఎంపై ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించిన రాధా
- తమ పొలాల్లో టవర్లు, లైన్లను కొనుగోలు చేసి ఖాళీ చేయలేదని..
- రూ.520 కోట్లు చెల్లించాలని ఎంసీఎం కంపెనీపై ఎన్‌సీఎల్‌టీకి వెళ్లబోతున్న రైతులు
- ఎంసీఎం, ల్యాంకో లిక్విడేటర్లకు ముందుగా నోటీసులు ఇవ్వాలని నిర్ణయం

కొండపల్లి ల్యాంకో పవర్ ప్లాంట్ వ్యవహారంలో రోజుకో కొత్త వివాదం తెరపైకి వస్తోంది. ఆక్షన్‌లో ఒక యూనిట్‌తో పాటు ప్లాంట్ భూభాగాన్ని కొనుగోలు చేసిన రాధా సంస్థ మరో యూనిట్ కొనుగోలు చేసిన మయన్మార్ దేశానికి చెందిన ఎంసీఎం కంపెనీపై ఎన్‌సీఎల్‌టీలో కేసు వేసింది. తమ భూమిలోని యూనిట్‌ను ఖాళీ చేయకుండా ఉన్నందుకు తమకు నెలకు రూ.2.50 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేసింది. ఇదే సందర్భంలో తమ పొలాల్లో టవర్లు, లైన్లను కొనుగోలు చేసి ఖాళీ చేయలేదని.. తమకు నెలకు రూ.16 కోట్ల చొప్పున 38 నెలల కాలానికి రూ.520 కోట్లు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎంసీఎం కంపెనీపై ఎన్‌సీఎల్‌టీ ఆశ్రయించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కొండపల్లి ల్యాంకో వివాదం సరికొత్త మలుపు తిరిగింది. ల్యాంకో పవర్ ప్లాంట్‌ను ఆక్షన్‌లో కొనుగోలు చేసిన రాధా, ఎంసీఎం కంపెనీల మధ్యన జగడం తలెత్తింది. ఈ రెండు సంస్థల మధ్యన నెలకొన్న వివాదం కాస్తా.. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)కి చేరింది. మయన్మార్ దేశానికి చెందిన ఎంసీఎం కంపెనీపై రాధా సంస్థ కేసు వేసింది. కొండపల్లి ల్యాంకో పవర్ ప్రాజెక్టును ఎన్‌సీఎల్‌టీ నియమించిన లిక్విడేటర్ ఆక్షన్ వేయగా.. ఈ రెండు సంస్థలు మిగతా 6లో..



ఎంసీఎం కంపెనీపై ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయిస్తూ పిటిషన్ వేసిన రాధా డాక్యుమెంట్ కాపీలు

కేడీసీసీబీ టర్నోవర్ రూ.11,307.14 కోట్లు

- కేడీసీసీబీ చైర్‌పర్సన్, జేసీ గీతాంజలిశర్మ

8లో

అవినీతిలో 'సహకారం'

ప్రారంభమేకాని విచారణ

పీఏసీఎస్‌ల్లో భారీగా నగదు గోల్‌మాల్!

రైతులు చెల్లించిన రుణాలు పక్కదారి

జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో పాలన గాడితప్పింది. రైతు రుణాలను సెక్రటరీలు, సిబ్బంది, పర్సన్ ఇన్‌చార్జిలు దారి మళ్లించారు. లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారు. ఈ విషయాలన్నీ పీఏసీఎస్‌ల్లో ఇటీవల చేపట్టిన కంప్యూటరీకరణతో వెలుగుచూస్తున్నాయి. వీటిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశాలు ఇస్తున్నా.. విచారణ మాత్రం నత్తనడకనే సాగుతోందని రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలువురు సెక్రటరీలు తమ పలుకుబడిని ఉపయోగించి విచారణ జరగకుండా తెరవెనుక మంత్రాంగం నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకొంతమంది పెద్దలు కేడీసీసీబీ, సహకారశాఖ అధికారులతో మంతనాలు జరిపి విచారణను అడ్డుకుంటున్నారని విమర్శలు కూడా వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో త్రిమెన్ కమిటీల నేతృత్వంలో నడిచిన పీఏసీఎస్‌ల్లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటి వెలుగుచూస్తున్నాయి.

- తాజాగా గోకవరం పీఏసీఎస్‌పై విచారణకు ఆదేశం
- తరకటూరు, ముచ్చర్ల, ముక్కొల్లులోనూ ఇదే పరిస్థితి
- నాగాయలంక పీఏసీఎస్‌లో ఎరువులు మాయం
- ఏళ్ల తరబడి కొనసాగుతున్న విచారణలు
- నిందితులపై చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్న అధికారులు
- గత వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి..



మచిలీపట్నం మండలం గోకవరం పీఏసీఎస్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలం గోకవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్)లో రైతులు తీసుకున్న రుణాలు చెల్లించారు. రైతులు రుణాలు చెల్లించినట్లు పీఏసీఎస్ రికార్డుల్లో చూపారు. కానీ కేడీసీసీ బ్రాంచ్‌లో రుణాలు ఇంకా చెల్లించనట్లుగా చూపుతోంది. దీంతో ఈ విషయం బయటకు వచ్చింది. ఈ పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై సహకారశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. అధికారుల ప్రాథమిక విచారణలో రూ.55 లక్షల వరకు నగదు పక్కదారి పట్టినట్లు తెలిసింది. ఇంతా జరిగినా ఈ పీఏసీఎస్‌పై 51 విచారణకు ఆదేశించలేదు. అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు బయటకు వస్తాయనే కారణంతో కొందరు పెద్దలు ఈ అంశంలో జోక్యం చేసుకుని తెరవెనుక కథ నడుపుతున్నట్లు సమాచారం. రూ.55 లక్షలు చెల్లిస్తారని, ఈ పీఏసీఎస్‌పై విచారణను నిలిపివేయాలని తెరవెనుక కొందరు మంతనాలు నడుపుతున్నట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ చేస్తే పీఏసీఎస్ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందనే కారణం చూపి రైతులు ఫిర్యాదులు చేయకుండా అడ్డుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ పీఏసీఎస్‌లో పెద్ద మొత్తంలోనే అవినీతి జరిగినా, విచారణను ముందుకు సాగనీయకుండా కొన్ని అదృశ్య శక్తులు అడ్డుకుంటున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత పది సంవత్సరాలుగా గోకవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా, పర్సన్ ఇన్‌చార్జిగా మాజీ మంత్రి పేర్ని నాని అనుచరుడు కొనసాగడం గమనార్హం.

గూడూరు మండలం తరకటూరు పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై రైతుల నుంచి ఫిర్యాదులు అందాయి. దీంతో జిల్లా సహకారశాఖ అధికారులు విచారణ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా అధికారులు ఈ పీఏసీఎస్‌లో ఇంకా విచారణను ప్రారంభించలేదు. ఒకటీ రెండు రోజుల్లో విచారణ చేస్తామని చెప్పడం గమనార్హం. పెడన మండలం ముచ్చర్ల పీఏసీఎస్‌లోనూ నగదు పక్కదారి పట్టిందనే అంశంపై ఫిర్యాదులు అందడంతో అధికారులు విచారణకు ఆదేశించారు. అక్రమాలపై పూర్తిస్థాయిలో, పారదర్శకంగా విచారణ చేస్తారా లేక మమ అనిపిస్తారా అనేది వేచి చూడాలి. ఈ పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై ప్రాథమిక విచారణ జరుగుతోందని, తదుపరి చర్యలు తీసుకుంటామని జిల్లా సహకారశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి తెలిపారు

ఎరువులు మాయం చేశారు

జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లతో పాటే నాగాయలంక పీఏసీఎస్‌ను ఇటీవల కంప్యూటరీకరణ చేశారు. ఈ సమయంలో ఈ పీఏసీఎస్‌కు వచ్చిన ఎరువులు పక్కదారి పట్టిన అంశం, ఎరువుల స్టాకులో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. టి-కొత్తపాలేనికి చెందిన ఇద్దరు రైతులకు రుణాలు ఇచ్చినా రికార్డులు సక్రమంగా లేవని గుర్తించారు. క్యాష్‌బుక్‌లో దిద్దుబాట్లు కూడా ఉన్నాయి. దీంతో ఈ వ్యవహారంపై పలు ఫిర్యాదులు అందాయి. సహకారశాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. ఎప్పటిలోగా ఈ విచారణను పూర్తి చేస్తారో తెలియనిస్థితి నెలకొంది.

ముక్కొల్లు పీఏసీఎస్ సెక్రటరీపై నేటికీ చర్యల్లేవు

గూడూరు మండలం ముక్కొల్లు పీఏసీఎస్‌లో పంట రుణాలు తీసుకున్న 25 మందికి పైగా రైతుల నుంచి సంబంధిత పీఏసీఎస్ సెక్రటరీ రుణాలకు సంబంధించిన నగదును వసూలు చేశారు. పీఏసీఎస్‌లో రుణాలు కట్టించుకోకుండా తన ఫోన్‌పే నంబరుకు నగదును సెక్రటరీ జమ చేయించుకున్నారు. సదరు సెక్రటరీపై ఉన్న నమ్మకంతో రైతులు నగదును ఫోన్‌పే రూపంలో చెల్లించారు. కానీ ఈ నగదును రైతుల ఖాతాల్లో రుణాలు చెల్లించినట్లుగా చూపలేదు. రైతులు మళ్లీ రుణం కోసం పీఏసీఎస్‌కు వెళితే రుణాలు చెల్లించనట్లుగా మిగతా 6లో..

ఫలించిన యార్లగడ్డ కృషి

కేడీసీసీ బ్యాంక్ ఉద్యోగుల పదోన్నతులు పునరుద్ధరణ

గత జనవరిలో పదోన్నతుల రద్దుపై ఆందోళన చేసిన ఉద్యోగులు

- మచిలీపట్నం వెళ్లి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చిన గన్నవరం ఎమ్మెల్యే
- ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి
- నేడు చీఫ్ మేనేజర్లుగా పదోన్నతులు కల్పించిన కేడీసీసీ బ్యాంక్ సీఈవో
- ఎమ్మెల్యే యార్లగడ్డను కలిసి కృతజ్ఞతలు తెలిపిన కేడీసీసీ ఉద్యోగులు



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలిసి సన్మానిస్తున్న కేడీసీసీ ఉద్యోగులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణాజిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ (కేడీసీసీ) బ్యాంక్‌లో పనిచేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ- సీ కేటగిరీల ఉద్యోగులకు పదోన్నతుల్లో జరిగిన అన్యాయంపై గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి చొరవ చూపించారు. వివరాల్లోకి వెళితే... చీఫ్ మేనేజర్లుగా మిగతా 6లో..

రూ.2 వేల కోట్ల భూ దోపిడీ!

గత వైసీపీ ప్రభుత్వంలో కొండలు, దిబ్బలు మాయం

ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా అక్రమ మైనింగ్



నందిగం సురేష్ అనుచరుడు పావులూరి నాగేశ్వరరావు క్వారీ(ఫైల్)

- నందిగం సురేష్, అంబటి రాంబాబు, వల్లభనేని వంశీ అనుచరుల నిర్వాకం
- ఎన్‌జీటీ ఆదేశించినా.. అక్రమార్కులపై నాడు కేసుల్లేవు
- అటవీ, రెవెన్యూ, మైనింగ్ శాఖలకు మాఫియా నుంచి వాటాలు!
- కూటమి ప్రభుత్వం రాకతో రంగంలోకి విజిలెన్స్ బృందాలు
- నాటి అక్రమాలు ఒక్కొక్కటిగా వెలికితీత
- ప్రధానమైన విజయవాడ రూరల్ మండలాన్ని వదిలేయడంపై విమర్శలు
- వెంటనే విచారణ చేపట్టాలని కోరుతున్న స్థానికులు

గత వైసీపీ పాలనలో ఒక్క విజయవాడ రూరల్ మండలంలోనే రూ.2 వేల కోట్ల భూ దోపిడీ జరిగిందని విమర్శలు వచ్చాయి. కొండలు, దిబ్బలు, ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా అక్రమ మైనింగ్ జరిగింది. వైసీపీ నాయకులు నందిగం సురేష్, అంబటి రాంబాబు, వల్లభనేని వంశీ అనుచరులమంటూ కొందరు రెచ్చిపోయారు. అటవీ, రెవెన్యూ, మైనింగ్ శాఖలను గుప్పెట్లో పెట్టుకుని హద్దు అదుపు లేకుండా అక్రమాలకు తెగబడ్డారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చర్యలకు ఆదేశించినా అక్రమార్కులపై కేసులు కట్టలేదు. కూటమి ప్రభుత్వం రాకతో రంగంలోకి దిగిన విజిలెన్స్ బృందాలు పోలవరం కాలువ గట్టు తవ్వకంపై దృష్టి సారించాయి. దాని పక్కనే అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ప్రాంతం వైపు కన్నెత్తి చూడకపోవడంపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వెంటనే విజిలెన్స్ అధికారులు ఈ రూ.2 వేల కోట్ల అవినీతిపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విజయవాడ రూరల్ మండలంలో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో సాగించిన అక్రమ మైనింగ్‌కు మరేదీ సాటిరాదు. కళ్లు తిరిగేలా అక్రమ మైనింగ్ ఇక్కడ జరిగింది. జక్కంపూడి, వేమవరం, కొత్తూరు, తాడేపల్లి, జీ కొండూరు మండలం వెలగలేరు గ్రామాల్లో అడ్డగోలుగా అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. అడవులు, అసైన్డ్ భూములు, కొండలు, గుట్టలను వదలకుండా కరిగించేశారు. కొత్తూరులో 227 సర్వే నంబర్, తాడేపల్లిలో 260 సర్వే నంబర్‌లోని వసంతరాయలు తిప్ప, తాడేపల్లిలోనే 244 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమి, మరో సర్వే నంబర్ 248లోని భూమి, ఇంకో సర్వే నంబర్ 247లోని దొండ తిప్ప, జక్కంపూడిలో సర్వే నంబర్ 147 సమీపంలో మిగతా 6లో..


ఏమార్చి..!

ఆర్‌డబ్ల్యూఎస్‌లో మిగులు ఉద్యోగుల ఘనకార్యం

అక్రమంగా ఆర్థిక ప్రయోజనాలు

ప్రభుత్వాన్ని ఏమార్చి అక్రమంగా ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలోని మిగులు ఉద్యోగులు. సర్‌ప్లస్ మ్యాన్‌పవర్ సెల్‌కి రిపోర్టు చేయాలని నాడు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా నేటి వరకు పట్టించుకోలేదు. పదవీ విరమణ వయస్సు దాటిపోయినా ఇంకా విధుల్లో కొనసాగుతున్నారు. ఈ విషయం ఎక్కడ బయటకు వచ్చి తాము ఇబ్బందుల్లో పడతామోనని ఆ శాఖ ఉన్నతాధికారులు ఆందోళన చెందుతున్నారు.

- ఎస్ఎంపీసీకి రిపోర్టు చెయ్యకుండా తాత్సారం
- హైకోర్టు ఆదేశించినా కదలని సదరు ఉద్యోగులు
- పదవీ విరమణ వయస్సు దాటినా కొనసాగుతున్న వైనం
- ఆందోళనలో ఆ శాఖ ఉన్నతాధికారులు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు వివిధ శాఖల తరపున ఉద్యోగులు వచ్చారు. ఆ క్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లాకు కూడా అప్పట్లో ఉద్యోగులు పలువురు వచ్చారు. వివిధ శాఖల్లో అదనంగా పనిచేస్తున్న 58 మందిని జిల్లా యంత్రాంగం గుర్తించింది. వీరిని అప్పట్లో జిల్లా ఉపాధి కల్పనా శాఖ నేతృత్వంలో పనిచేసే సర్‌ప్లస్ మ్యాన్‌పవర్ సెల్ (ఎస్ఎంపీసీ)కి బదలాయింపు చేసింది. ఈ ఉద్యోగులను ఆ తర్వాత వివిధ శాఖలకు కేటాయించింది. అనంతరం అప్పటి ఉమ్మడి కృష్ణాజిల్లా కలెక్టర్ జరిగిన పొరపాటును గుర్తించి వారిని తిరిగి సర్‌ప్లస్ మ్యాన్‌పవర్ సెల్ (ఎస్ఎంపీసీ)కు వచ్చేయాలని ఆదేశాలు మిగతా 6లో..

నేటి నుంచి టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

1300 మంది టీచర్ల నియామకం

వారం పాటు 1,91,627 జవాబు పత్రాల మూల్యాంకనం



సూచనలు ఇస్తున్న పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే జిల్లా విద్యాశాఖాధికారి రామారావు తగిన ఏర్పాట్లు చేశారు. మచిలీపట్నం లేడీ యాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారం రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ శిబిరానికి క్యాంపు ఆఫీసర్‌గా డీఈవో వ్యవహరిస్తారు. స్ట్రాంగ్ రూం డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌గా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్ రాజు వ్యవహరించనున్నారు. డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లుగా ఉయ్యూరు డీవైఈవో పద్మజారాణి, బందరు డీవైఈవో శేఖర్ సింగ్‌లను నియమించారు. 16 రూములు, రెండు హాళ్లలో జరగనున్న ఈ స్పాట్ వాల్యుయేషన్‌కు 134 సీఈలు, 794 మంది ఏఈలు, 268 స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు. 1,91,627 జవాబు పత్రాలను వారం రోజుల పాటు మూల్యాంకనం చేయనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాలయం ఇంటర్ జవాబు పత్రాలు 15,754 వాల్యుయేషన్ చేయనున్నారు. ఇందుకు 145 మంది సీఈలు, ఏఈలు, 70 మంది స్పెషల్ అసిస్టెంట్లను నియమించారు.

నిశీధిలో నరకం

- పేరుకు మాత్రమే హైవే పెట్రోలింగ్
- వాహనాలు ఆగినా పట్టించుకోని దుస్థితి
- అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ కష్టాలు

8లో

పర్యాటక ప్రదేశంగా నవలంక..!

- పరిశీలించిన పర్యాటక శాఖ అధికారులు

మందార కుసుమ ప్రియ..



దుర్గగుడిలో మందార, కలువలతో పుష్పార్చన

» దుర్గమ్మకు ఎర్రకలువలు, మందారాలతో అర్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో చైత్రమాస వసంత నవరాత్రుల క్రమంలో నాలుగవ రోజైన బుధవారం దుర్గమ్మకు మందారాలు, కలువపూలతో అర్చన చేశారు. లలితా సహస్రనామ పారాయణ అనుసంధానం చేస్తూ భక్తి కైంకర్యం సమర్పిస్తూ పుష్పాలను సమర్పించారు. ప్రతిరోజూ పుష్పాలతో అమ్మవారిని



అర్చించటం జరుగుతుంది. రోజుకొక రకం పుష్పం ఎంపికలో ఒక క్రమ విధానాన్ని అనుసరిస్తారు. ఆయా వారాలను బట్టి పూలను ఎంపిక చేస్తారు. బుధవారం అమ్మవారికి మందారాలు, కలువపూలను సమర్పించటంలో ఎంతో వైవిధ్యం ఉంది. అమ్మవారిని మందార కుసుమ ప్రియ అని అర్చిస్తుంటారు. చైత్రమాస వసంత నవరాత్రుల్లో అమ్మవారికి పూలతో పూజ చేయటం వల్ల సుఖశాంతులు ఆయురారోగ్యాలు, భోగ భాగ్యాలు కలుగుతాయని భక్తుల నమ్మిక.

దుర్గగుడి డిప్యూటీ ఈవో రత్నరాజు బదిలీ

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానం డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజును బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి వి.వినయ్ చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దేవదాయ శాఖ కమిషనరేట్‌లోని జనరల్ విభాగం డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. డిప్యూటీ కమిషనర్ పోస్టు ప్రస్తుతం ఖాళీగా ఉండటంతో పరిపాలనా సౌలభ్యం కోసం ఆయనను నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



నూతిపాడు వద్ద సాగర్ జలాలను పరిశీలిస్తున్న కోట వీరబాబు

15 వరకు సాగర్ జలాలను విడుదల చేయండి

» తెలంగాణ సర్కారుకు ఎన్ఎస్పీ చైర్మన్ వినతి

విస్సన్నపేట/రెడ్డిగూడెం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సాగర్ మూడోజోన్‌కు ఏప్రిల్ 15 వరకు సాగు నీరు విడుదల చేయాలని ఎన్ఎస్పీ ఎడమ కాలువ ప్రాజెక్టు చైర్మన్ కోట వీరబాబు, వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావులు తెలంగాణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం నూతిపాడు 101 కిలోమీటర్ రెగ్యులేటర్ వద్ద, రామచంద్రాపురం 117 వద్ద నీటి విడుదలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా కోట వీరబాబు మాట్లాడుతూ, 101 నుంచి దిగువకు 1500 క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేశారని, ఎడమ కాలువలో ఉన్న 3.2 లక్షల ఆయకట్టుకు 32 టీఎంసీల వాటా ఉండగా తెలంగాణ ప్రభుత్వం కేవలం 22 టీఎంసీలు మాత్రమే విడుదల చేసిందన్నారు. ఏప్రిల్ 15 వరకు నీటిని ఏపీలోని దిగువ ప్రాంతాలకు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. లేకుంటే ఆరుతడి పంటలు మొత్తం ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. మూడో జోన్‌కు ఇస్తున్న 1580 క్యూసెక్కుల నీటి డిచార్జిని 2 వేల క్యూసెక్కులకు పెంచాలన్నారు. 1400 టీఎంసీ అధికార వాటా ఉన్నప్పటికీ 4.56 టీఎంసీలు మాత్రమే విడుదల చేశారన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లు, అధికారులు పాల్గొన్నారు.



వేడుకలకు ముస్తాబవుతున్న పోలవరపు శేషయ్య జడ్పీ పాఠశాల

వజ్రోత్సవ వేడుకకు ముస్తాబు

» 5న పోలవరపు శేషయ్య జడ్పీ హైస్కూల్ పూర్వవిద్యార్థుల కలయిక

కూచిపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య స్వగ్రామం భట్లపెనుమర్రులో పోలవరపు శేషయ్య జడ్పీ పాఠశాల స్థాపించి 75 వసంతాలైన సందర్భంగా వజ్రోత్సవ (డైమండ్ జూబ్లీ) వేడుకలకు ముస్తాబవుతోంది. ఏప్రిల్ 5న వేడుకకు పూర్వ విద్యార్థులు నడుం బిగించారు. ఎన్నారైల ఆర్థిక సహకారంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్టు పూర్వ విద్యార్థులు తెలిపారు. 1949-50 సంవత్సరంలో పూరిపాకలో ప్రారంభమైన పాఠశాల.. గ్రామానికి చెందిన పోలవరపు శేషయ్య రూ.25 వేలఆర్థిక సహకారంతో 1958వ సంవత్సరంలో పక్కా భవనంలోకి మారింది. నాటి నుంచి పోలవరపు శేషయ్య జడ్పీ పాఠశాలగా కొనసాగుతోంది. పాఠశాలలో విద్య నేర్చిన ఎందరో విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఏప్రిల్ 5న పూర్వ విద్యార్థుల కలయికలో భాగంగా డైమండ్ జూబ్లీ వేడుకల్లో జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య, పాఠశాల నిర్మాణ దాత పోలవరపు శేషయ్య విగ్రహాలను పాఠశాల ఆవరణలో ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 75 సంవత్సరాల పైలాన్ ఆవిష్కరించి గురువులను సత్కరించనున్నారు.

నగర ప్రజలను మళ్లీ మురిపించనున్న..

విజ్ఞానం వినోదం

ఎగ్జిబిషన్ సొసైటీపై ఆడిటింగ్‌కు కలెక్టర్ లక్ష్మీశ ఆదేశం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాల ఆడిటింగ్‌కు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు వీలుగా ఆయన సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎగ్జిబిషన్ల పునరుద్ధరణకు కలెక్టర్ లక్ష్మీశ చొరవ మంచిదే అయినప్పటికీ గతంలో ఆర్థిక అవకతవకల నేపథ్యంలో, సొసైటీ ఆర్థిక వ్యవహారాలు పకడ్బందీగా, పారదర్శకంగా ఆన్‌లైన్ విధానాన్ని తీసుకురావాల్సిన అవసరం ఉంది.

» ఎగ్జిబిషన్ల నిర్వహణ దిశగా అడుగులు
» కలెక్టర్ చొరవతో పూర్వ వైభవం
» గత అనుభవాల దృష్ట్యా పారదర్శకత అవసరం

అవినీతి ఆరోపణలతో ప్రాభవం కోల్పోయిన ఎగ్జిబిషన్ సొసైటీని తిరిగి గాడిన పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దశాబ్దంన్నర క్రితం ఆర్థిక అవకతవకలతో అట్టుడికిన ఎగ్జిబిషన్ సొసైటీ ఆ తర్వాత జిల్లా యంత్రాంగం ప్రోత్సాహకానికి దూరమై ఎగ్జిబిషన్ నిర్వహణ చేపట్టలేక ఇన్నేళ్లు ప్రాభవం కోల్పోయింది. గత కలెక్టర్లు ఎగ్జిబిషన్ సొసైటీపై ఉక్కుపాదం మోపారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాలను తిరిగి పునరుద్ధరించేందుకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నిర్ణయం తీసుకున్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాల ఆడిటింగ్‌కు ఆదేశించారు.

పాతికేళ్లుగా ప్రతీ ఏడాది బెజవాడలో వ్యవసాయ పారిశ్రామిక ఎగ్జిబిషన్ నిర్వహణ జరిగేది. దీనికోసం నగరంలోని స్వరాజ్యమైదానాన్ని సుదీర్ఘ కాలం లీజుకు తీసుకున్న 'కృష్ణా ఇండస్ట్రియల్ అండ్ అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్ సొసైటీ' పాతికేళ్ల పాటు ఘనమైన సేవలు అందించింది. అనంతరం అనూహ్యంగా ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలతో జిల్లా యంత్రాంగం వేటుకు గురికావాల్సి వచ్చింది. సుమారు దశాబ్దంన్నర కాలంగా ఎగ్జిబిషన్ల నిర్వహణ జరగలేదు. ఇన్నాళ్లకు ఎగ్జిబిషన్ సొసైటీని తిరిగి గుర్తించే దిశగా అడుగులు పడుతున్నాయి.

ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు చాల కాలంగా ప్రయత్నాలు చేస్తున్నా జిల్లా యంత్రాంగం నుంచి సానుకూల స్పందన రాకపోవటంతో సొసైటీ గుర్తింపునకు నోచుకోలేదు. పదిహేనేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సొసైటీ పట్ల సానుకూలంగా స్పందించారు. పబ్లిక్ గ్రీవెన్స్ ద్వారా కలెక్టర్‌ను ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు కలిశారు. ఎగ్జిబిషన్ సొసైటీ చరిత్ర దాని నేపథ్యం తెలుసుకుని కలెక్టర్ ప్రత్యేకంగా వారితో సమావేశమయ్యారు. ఎగ్జిబిషన్ సొసైటీ గుర్తింపునకు నోచుకోకపోవటానికి కారణాలను తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ ఎగ్జిబిషన్లు నిర్వహించటానికి వీలుగా జిల్లా యంత్రాంగం అధ్యయనం చేయాల్సి ఉందన్న విషయాన్ని నిర్వాహకులతో చర్చించారు. ఎగ్జిబిషన్ సొసైటీ బైలాను కూడా ఆయన అధ్యయనం చేయనున్నారు. సొసైటీ స్థిర, చరాస్తులు, వాటి లెక్కలు కూలంకషంగా పరిశీలించిన మీదట ఎగ్జిబిషన్ సొసైటీకి తగిన గుర్తింపు ఇచ్చి ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలన్న దానిపై కలెక్టర్ ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

పదిహేనేళ్లుగా నగర ప్రజలకు విజ్ఞానం, వినోదం దూరం..

పదిహేనేళ్లుగా ఎగ్జిబిషన్లు లేకపోవటంతో.. నగర ప్రజలకు విజ్ఞానం, ఆహ్లాదం కరువైంది. గతంలో విజయవాడలో ఎగ్జిబిషన్ అంటే క్రేజ్ ఉండేది. దేశవ్యాప్తంగా వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తులను ప్రదర్శించటానికి ప్రతిష్ఠాత్మక సంస్థలు పోటీ పడేవి. ఎగ్జిబిషన్లు విజ్ఞానదాయకం, వినోదంగానూ ఉండేవి. ఎగ్జిబిషన్లను ఎగ్జిబిషన్ సొసైటీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేది. అనూహ్యంగా పాతికేళ్ల తర్వాత సొసైటీపై వచ్చిన ఆరోపణలు అప్పట్లో మీడియాలో సంచలనమయ్యాయి. స్టాల్స్ కేటాయింపులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, ఖర్చులు ఎక్కువగా చూపారని ఆరోపణలు వచ్చాయి. దాంతో అప్పటి కలెక్టర్ బీఆర్ మీనా విచారణకు ఆదేశించి తర్వాత దాని గుర్తింపును రద్దు చేశారు.

అనుమతుల కోసం ఎగ్జిబిషన్ సొసైటీ పోరాటం..

అవినీతి ఆరోపణలతో ఎగ్జిబిషన్ సొసైటీ అతలాకుతలమైంది. తిరిగి రిజ్వీ కలెక్టర్‌గా ఉన్నపుడు మరోమారు ఎగ్జిబిషన్ నిర్వహణకు సొసైటీ నిర్వాహకులు అనుమతులు కోరగా అప్పటి కలెక్టర్ రిజ్వీ విచారణ జరిపి బైలా మార్పులకు సూచించారు. అప్పట్లో ఎగ్జిబిషన్ సొసైటీకి జిల్లా కలెక్టర్ గౌరవ చైర్మన్‌గా ఉండేవారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈ పదవులను తొలగించాలని కలెక్టర్ రిజ్వీ సూచించారు. ఎగ్జిబిషన్ల నిర్వహణకు మాత్రం అనుమతులు ఇవ్వలేదు.

కలెక్టర్ లక్ష్మీశ చొరవతో ముందుకు..

తిరిగి ఇన్నాళ్లకు సొసైటీ నిర్వాహకులు ఎగ్జిబిషన్ల నిర్వహణకు అనుమతుల కోరుతూ ముందుకు రావటం.. ప్రస్తుత కలెక్టర్ లక్ష్మీశ సానుకూలంగా స్పందించటంతో కదలిక వచ్చింది. భవిష్యత్తులో ఆర్థిక అవకతవకలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ ఉండేలా, పారదర్శకంగా ఆన్‌లైన్ మానిటరింగ్ చర్యలు తీసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. దీనికి అనుగుణంగా కలెక్టర్ లక్ష్మీశ ఎగ్జిబిషన్ సొసైటీ కార్యకలాపాలకు సంబంధించి ఆడిటింగ్‌కు ఆదేశించారు. ఈ ఆడిటింగ్ ద్వారా సొసైటీ కార్యకలాపాలపై పూర్తి అవగాహన రానుంది. ఈ మేరకు తదుపరి చర్యలను కలెక్టర్ తీసుకోనున్నారు.

ఏమార్చి..!

(5వ పేజీ తరువాయి)

ఇచ్చారు. కలెక్టర్ ఆదేశాలపై అప్పట్లో సర్‌ప్లస్ ఉద్యోగులంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. న్యాయస్థానంలో వీరికి చుక్కెదురైంది. ఉద్యోగులంతా రిపోర్టు చేయాల్సిందిగా న్యాయస్థానం ఆదేశించింది. అప్పట్లో కలెక్టర్ పొరపాటు జరిగిందన్నదానికి కూడా ఓ పెద్ద కథే ఉంది. కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి అప్పటి ఉపాధి కల్పనాశాఖాధికారి అనధికారికంగా ఉత్తర్వులు ఇచ్చారన్న వివాదం కూడా ఉంది. ఈ విషయం తెలిసి కలెక్టర్ తిరిగి వారిని సర్‌ప్లస్ మ్యాన్‌పవర్ సెల్‌కు రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చినట్టు సమాచారం. ఇందులో వాస్తవం ఏదైనా ఆయా శాఖలకు కేటాయించిన సర్‌ప్లస్ ఉద్యోగులందరినీ తిరిగి ఎస్ఎంపీసీకి రిపోర్టు చేయమన్నది మాత్రం వాస్తవం.

కలెక్టర్ ఆదేశాలను దాచిపెట్టి..

అప్పట్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు వచ్చిన 58 మంది ఉద్యోగులలో సింహభాగం అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు వెనక్కు వచ్చేశారు. సర్‌ప్లస్ మ్యాన్ పవర్ సెల్ (ఎస్ఎంపీసీ)లో రిపోర్టు చేశారు. కొన్ని శాఖల్లో పనిచేసే సిబ్బంది మాత్రం రిపోర్టు చెయ్యటానికి సిద్ధపడలేదు. కలెక్టర్లు మారటంతో ఈ వ్యవహారం మరుగున పడిపోయింది. ఇలా రిపోర్టు చెయ్యని ఉద్యోగుల్లో గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్) విభాగంలోకి వచ్చిన ఉద్యోగులు కూడా ఉన్నారు. విజయవాడ సర్కిల్ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులలో ఒకరు కలెక్టర్ నుంచి వచ్చిన ఆదేశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లకుండా దాచారు. దీంతో చాలా ఏళ్లుగా ఈ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులంతా కూడా ఎస్ఎంపీసీకి రిపోర్టు చేయకుండా ఉండి పోయారు. మధ్య మధ్యలో ఎస్ఎంపీల నుంచి రిపోర్టులు కోరినా కూడా అవి కూడా తెలియకుండా జాగ్రత్త పడ్డారు. దీంతో అనధికారికంగా చాలా కాలంగా ఆర్‌డబ్ల్యూఎస్‌లో మిగులు ఉద్యోగులు కొనసాగుతూ వస్తున్నారు. ఆ తర్వాత ఉన్నతాధికారులకు తెలిసినా.. అప్పటికే చాలా కాలం నుంచి ఉండటం వల్ల పెద్దగా పట్టించుకోలేదు. ఇటీవలే సర్‌ప్లస్ ఉద్యోగులకు సంబంధించిన పదవీ విరమణ వయస్సును 58 సంవత్సరాలుగా హైకోర్టు నిర్దేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. సర్‌ప్లస్ ఉద్యోగులంతా కూడా కార్పొరేషన్ల పరిధిలో ఉన్నవారే కావటంతో 58 సంవత్సరాల వయస్సు వర్తిస్తుంది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారుల గుండెల్లో బాంబు పేలినట్టు అయింది. ఎందుకంటే ఆర్‌డబ్ల్యూఎస్‌లో పనిచేస్తున్న వారు ఇప్పటికే పదవీ విరమణ చేయాల్సి ఉంది. పదవీ విరమణ వయస్సు దాటినా ఇంకా కొనసాగుతున్నారు. పదవీ విరమణ చేయాల్సిన ఉద్యోగులను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారం ఎక్కడ బయట పడుతుందోనన్న ఉద్దేశ్యంతో ఇప్పుడు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు భయపడుతున్నారు.

ఆక్వాకు ఉజ్వల భవిష్యత్తు

» డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు
» తెంపల్లిలో బయోమెడ్ ఆక్వా కేర్ ప్రారంభం

గన్నవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆక్వా రంగానికి మంచి భవిష్యత్ ఉందని డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు అన్నారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెంది నిరుద్యోగులకు ఉద్యోగవకాశాలు కల్పించాలన్నారు. తెంపల్లి గ్రామంలో బయోమెడ్ ఆక్వా కేర్ కంపెనీ ప్రొటెక్షన్ ప్లాంట్, మైక్రోబయాలజీ యూనిట్, మినరల్ బ్యాచింగ్ యూనిట్‌లను బుధవారం రాత్రి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాసరావులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ, అన్ని వసతులతో బయోలజీ ప్లాంటు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గన్నవరం ప్రాంతంలో కంపెనీని ప్రారంభించి యువతకు ఉపాధి కల్పించటంపై యాజమాన్యానికి ధన్యావాదాలు తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకూ 7వేలమందికి పైగా ఉపాధి కల్పించినట్టు చెప్పారు. బయోమెడ్ ఎండీ పీవీ కృష్ణంరాజు మాట్లాడుతూ, 2003లో నలుగురు ఉద్యోగులు, రెండు ఉత్పత్తులతో ప్రారంభమైన తమ సంస్థ నేడు 35 ఉత్పత్తులు, 430 మంది డీలర్లు 100 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ రైతులు, డీలర్ల మన్ననలు పొందుతున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యేలు డి.సుబ్బరాజు, వి.నరేంద్ర వర్మ, టెక్నికల్ డైరెక్టర్ ఏవీ దుర్గా ప్రసాద్, మార్కెటింగ్ డైరెక్టర్ పి.కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.



బయోమెడ్ ఆక్వా కేర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, కామినేని శ్రీనివాస్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు

ఏపీలో ఆస్పిరేషనల్ బ్లాక్స్ వివరాలు చెప్పండి..

» లోక్‌సభలో కేంద్ర ప్రణాళికా శాఖను కోరిన ఎంపీ కేశినేని చిన్ని



వన్‌టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీలో ఆస్పిరేషనల్ బ్లాక్స్ (ఎబిపి)కి సంబంధించి మంజూరు చేసిన, వినియోగించిన నిధులు వివరాలు తెలియపరచాలని లోక్‌సభలో కేంద్ర ప్రణాళికా మంత్రిత్వ శాఖను బుధవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. దీనికి స్పందిస్తూ కేంద్ర గణాంక, ప్రణాళికా అమలు మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానం తెలిపారు. ఏపీలో ఆస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగ్రామ్ (ఎబిపి) కింద 7 జిల్లాల్లో 15 బ్లాక్స్ గుర్తించారని, వాటిలో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహింపట్నం, పెనుగంచిప్రోలు ప్రాంతాల్లో బ్లాక్స్ గుర్తించినట్టు తెలిపారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ రూ.2.51 కోట్లు విడుదల చేయగా, రూ.48 లక్షలు వినియోగించినట్టు తెలిపారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా బ్లాక్ స్థాయిలో పాలన మెరుగుపరచడం, పారదర్శకత, అభివృద్ధిని వేగవంతం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

విశాఖపట్నం-చర్లపల్లి మధ్య
వేసవి ప్రత్యేక రైలు

రేల్వేస్టేషన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : వేసవి రద్దీ దృష్ట్యా దక్షిణమధ్య రైల్వే చర్లపల్లి-విశాఖపట్నం వన్‌వే ప్రత్యేక రైలు నడుపుతున్నట్టు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ కె.శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 3న 07011 చర్లపల్లి-విశాఖపట్నం రైలు చర్లపల్లిలో రాత్రి 8.15 గంటలకు బయలుదేరి మరునాడు ఉదయం 9.30 గంటలకు విశాఖపట్నం చేరుతుంది. నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, తుని, యలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ స్టేషన్లలో రైలు ఆగుతుంది. 2ఏ, 3ఈ, స్లీపర్ క్లాస్‌తోపాటు జనరల్, సెకండ్ క్లాస్ ఉన్నాయి.

యార్లగడ్డ కృషి..

(5వ పేజీ తరువాయి)

పదోన్నతులు ఇచ్చినట్టే ఇచ్చి వెంటనే వాటిని రద్దు చేయటంపై గత జనవరిలో మచిలీపట్నంలోని కేడీసీసీ బ్యాంకు ఎదుట పెద్ద ఎత్తున ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. బలహీన వర్గాలు, దళిత ఉద్యోగులకు అన్యాయం చేసే విధంగా అధికారులు వ్యవహరించారని నిరసన తెలిపారు. బ్యాంకు ఎదుటే బైఠాయించి దీక్ష చేపట్టిన విషయాన్ని కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలుసుకున్నారు. వెంటనే మచిలీపట్నం వెళ్లి ఆందోళన చేస్తున్న ఉద్యోగులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ అంశాన్ని తీసుకు వెళ్లి తప్పకుండా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో యార్లగడ్డ వెంకట్రావుపై నమ్మకంతో ఉద్యోగులు కూడా ఆందోళన విరమించారు. ఆ తర్వాత కేడీసీసీ బ్యాంక్ దళిత, బీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి యార్లగడ్డ ప్రత్యేకంగా తీసుకువెళ్లారు. దీంతో ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంది. దళిత, బీసీ ఉద్యోగులకు ఇచ్చిన పదోన్నతులను రద్దు చేయవద్దని ఆదేశించింది. దీంతో కేడీసీసీ బ్యాంక్ సీఈవో వారి పదోన్నతులను పునరుద్ధరిస్తూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కేడీసీసీ బ్యాంక్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. తమ పదోన్నతులకు ముఖ్య కారణమైన గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ప్రత్యేకంగా తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కేడీసీసీ బ్యాంకు అభివృద్ధికి దోహదపడాలని, ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా ఆదుకోవటానికి తాను సిద్ధంగా ఉంటానని ఈ సందర్భంగా తనను కలిసిన ఉద్యోగులతో యార్లగడ్డ అన్నారు.

అవినీతిలో సహకారం

(5వ పేజీ తరువాయి)

రికార్డులు చూపాయి. దీంతో రైతులు పీఏసీఎస్ సెక్రటరీకి తాము చెల్లించిన నగదు మొత్తాలకు సంబంధించిన పూర్తి స్థాయి వివరాలు, ఆధారాలతో ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన అధికారులు రూ.45 లక్షల వరకు నగదు పక్కదారి పట్టినట్లుగా నిర్ధారించారు. అధికారుల విచారణలో నిజాలు నిగ్గుదేలడంతో అక్రమాలకు పాల్పడిన పీఏసీఎస్ సెక్రటరీ తప్పించుకుతిరుగుతున్నాడు. నగదును రికవరీ చేయకుండా, సంబంధిత సెక్రటరీపై శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా అధికారులు నేటికీ మీనమేషాలు లెక్కించడానికి గల కారణాలపై అనేక అనుమానాలు రైతులు వ్యక్తం చేస్తున్నారు.

భూ దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

అడ్డగోలుగా లక్షలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్‌ను వైసీపీ మైనింగ్ మాఫియా దోచుకుపోయింది.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదులు

మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అనుచరులుగా చెప్పుకుని మరీ విచ్చలవిడిగా దోపిడీ చేశారు. అటవీ భూములను కూడా చెరబట్టి అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)కి కూడా వీరిపై ఫిర్యాదు చేయటం జరిగింది. ఎన్‌జీటీ ఆదేశాల మేరకు అప్పటి సబ్ కలెక్టర్ తనిఖీలకు వస్తున్నారన్న సమాచారంతో.. వాహనం ముందుకు కదలకుండా ఏకంగా దారికి గండిని కొట్టించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు కూడా ఈ మైనింగ్ మాఫియాకు సహకరించాయని విమర్శలు ఉన్నాయి. వ్యవస్థలకు కూడా అప్పట్లో తమ అక్రమ మైనింగ్‌లో వాటాలు ఇవ్వటంతో అక్రమాలను అడ్డుకునే వారే కరువయ్యారు. దాదాపుగా నాలుగేళ్ల పాటు నిరంతరాయంగా అక్రమ క్వారీయింగ్ జరిపారు. ఈ అక్రమ క్వారీయింగ్ విలువ రూ.2 వేల కోట్లుగా ఉంటుందన్నది అంచనాగా ఉంది.

కేసులు నమోదు చేయమన్నా..

ఎన్‌జీటీ కేసులు నమోదు చేయమని నాటి జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాల్సిందిగా అప్పటి కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ కాంతి రాణాకు లేఖ కూడా రాశారు. అయినా కూడా చర్యలు తీసుకోలేదు. మైనింగ్ అధికారులు కూడా అక్రమార్కులకు వత్తాసు పలికేలా వ్యవహరించారు. రెవెన్యూ యంత్రాంగమైతే అప్పట్లో మైనింగ్ మాఫియాకు ఏజెంట్ల మాదిరిగా పనిచేసిందనే ఆరోపణలు ఉన్నాయి. 'ఆంధ్రజ్యోతి'తో పాటు అనేక పత్రికల్లో సీరియల్‌గా విజయవాడ మండలంలో జరిగిన అక్రమాలపై కథనాలు ప్రచురితమైన అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం గన్నవరం మండలంలో అక్రమ క్వారీయింగ్‌ను నిగ్గుతేల్చినట్టుగానే విజయవాడ రూరల్ మండలంలో కూడా నిగ్గుతేల్చాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

జగడం!

(5వ పేజీ తరువాయి)

వేర్వేరు యూనిట్లను కొనుగోలు చేశాయి. రాధా సంస్థ ఒక యూనిట్‌తో పాటు ప్లాంట్ భూభాగాన్ని కొనుగోలు చేసింది. ఎంసీఎం కంపెనీ మరో యూనిట్‌తో పాటు ల్యాంకో విద్యుత్ లైన్‌ను కొనుగోలు చేసింది. ఎంసీఎం కంపెనీ కేవలం స్క్రాప్ కిందనే యూనిట్‌ను కొనుగోలు చేయటం జరిగింది. భూమి మాత్రం కొనలేదు. దీంతో రాధా సంస్థ, ఎంసీఎం కంపెనీపై తమ భూభాగంలో ఉన్న యూనిట్‌ను తరలించనందున నెలకు రూ.2.50 కోట్లు చెల్లించాల్సిందిగా డిమాండ్ చేస్తూ ఎన్‌సీఎల్‌టీలో కేసు నమోదు చేసింది. ఈ ప్రకారం చూస్తే దాదాపుగా 20 నెలలకు రూ. 50 కోట్ల మేర ఎంసీఎం కంపెనీ చెల్లించాల్సి ఉంటుందని తెలుస్తోంది. ఈ తాజా వివాదంతో విజయవాడ వెస్ట్ బైపాస్‌లో ల్యాంకో లైన్ల అలైన్‌మెంట్ మార్పిడి సమస్యకు పరిష్కారం దిశగా అడుగు పడింది. ఈ రెండు సంస్థలు ల్యాంకో పవర్ ప్లాంట్‌ను యూనిట్ల వారీగా కొనుగోలు చేశాయన్నది స్పష్టమవుతోంది. ల్యాంకోకు చెందిన ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్స్ లైన్‌ను ఎంసీఎం కంపెనీ ఊడదీసుకుని వెళ్లాల్సి ఉంటుంది. అలాంటపుడు.. ఇక ల్యాంకో లైన్ అలైన్‌మెంట్ మార్చాల్సిన అవసరమే లేదు. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) అధికారులు డబ్బులు చెల్లించాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఈ విషయాన్ని జాతీయ రహదారుల సంస్థ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వాస్తవ పరిస్థితులు నివేదిస్తే సమస్య చిటికెలో పరిష్కారం అవుతుంది.

ఎంసీఎం సంస్థ, ల్యాంకో లిక్విడేటర్‌పై కేసులు వేసేందుకు రైతులు రెడీ

ఎంసీఎం సంస్థపై రాధా సంస్థ కేసు వేసిన నేపథ్యంలో బాధిత ఎన్టీఆర్ జిల్లా రైతాంగం కూడా ఎంసీఎం సంస్థపై ఎన్‌సీఎల్‌టీలో కేసులు వేసేందుకు సిద్ధమైంది. అలాగే ల్యాంకో లిక్విడేటర్‌పైనా ఎన్‌సీఎల్‌టీలో కేసులు వేసేందుకు తాజాగా జరిగిన సమావేశంలో నిర్ణయం తీసుకుంది. ఎంసీఎం కంపెనీ తమ పొలాల మీదుగా వెళుతున్న లైన్‌ను తొలగించకపోవటం వల్ల తమకు జరిగిన నష్టంపై ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించాలని భావిస్తోంది. ల్యాంకో ట్రాన్స్‌మిషన్ లైన్ల కింద 52 మీటర్లు వెడల్పున 20 కిలోమీటర్లు సాగుతున్న ల్యాంకో ట్రాన్స్‌మిషన్ లైన్ కారణంగా 250 ఎకరాల వరకు రైతులకు నష్టం వాటిల్లుతుందని, నెలకు రూ.16 కోట్ల చొప్పున 38 నెలల కాలానికి రూ.520 కోట్లు చెల్లించాల్సిందిగా డిమాండ్ చేయాలని నిర్ణయించింది. ముందుగా ఎంసీఎం కంపెనీ, ల్యాంకో లిక్విడేటర్‌లకు నోటీసులు ఇచ్చి 15 రోజుల లోపు సంతృప్తికరంగా సమాధానం ఇవ్వకపోతే ఎన్‌సీఎల్‌టీని ఆశ్రయించాలని రైతాంగం నిర్ణయించింది.

ఎన్‌సీఎల్‌టీ అసహనం

కొండపల్లిలో మూతపడిన ల్యాంకో పవర్ ప్లాంట్‌ను ఆక్షన్ వేసి అప్పుల వాళ్లకు సెటిల్‌మెంట్ చేసేందుకు ఎన్‌సీఎల్‌టీ ఒక లిక్విడేటర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత లిక్విడేటర్ రంగంలోకి దిగి ల్యాంకో పవర్ ప్లాంట్‌ను యూనిట్ల వారీగా ఆక్షన్ వేయటం జరిగింది. ఒక యూనిట్‌ను మొత్తం భూభాగంతో సహా రాధా సంస్థ కొనుగోలు చేయగా, మరో యూనిట్‌ను రిలయెన్స్ సంస్థ కొనుగోలు చేసింది. మూడో యూనిట్, ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ లైన్స్‌ను మయన్మార్‌కు చెందిన ఎంసీఎం కంపెనీలకు విక్రయించింది. ఇంత వరకు బాగానే ఉన్నా .. ఆ తర్వాత సమస్యలు వచ్చాయి. ఒక యూనిట్, ల్యాంకో లైన్స్‌ను కొన్న ఎంసీఎం కంపెనీ పూర్తిగా లిక్విడేటర్‌కు డబ్బులు చెల్లించలేదు. దీంతో వీరిద్దరి మధ్యన వివాదం కూడా ఎన్‌సీఎల్‌టీలో కేసు నడుస్తోంది. ఎన్‌హెచ్ వంటి సంస్థలు ల్యాంకో లిక్విడేటర్‌ను సంప్రదించకుండా రాధా సంస్థతో సంప్రదింపులు జరపటం, అలైన్‌మెంట్ మార్పు వ్యవహారాలు తెరమీదకు రావటం ఇవన్నీ కూడా గందరగోళంగా మారటంతో ఎన్‌సీఎల్‌టీ లిక్విడేటర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అంపైర్‌గా పనిచేయకుండా గోల్ కీపర్‌లా వ్యవహరించటంపై ఎన్‌సీఎల్‌టీ మండిపడింది. ఈ వ్యవహారంలో సరిగా వ్యవహరించకపోతే లిక్విడేటర్‌ను మార్చాల్సి ఉంటుందని కూడా హెచ్చరించినట్టు తెలుస్తోంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	153, 162, 173
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 450




చైత్రదీపికను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

స్కేటింగ్ విజేతకు ఎమ్మెల్యే సుజనా అభినందన

పెనమలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఎస్ఎస్ఎం పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న చైత్రదీపిక గతనెల 24నుంచి 30వరకు తైవాన్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్‌లో మరో క్రీడాకారిణి కైవల్యతో కలిసి బంగారు పతకం, కపుల్ డాన్స్ విభాగంలో రజత పతకం, ఇన్‌లైన్ విభాగంలో కాంస్యపతకం సాధించింది. చైత్ర దీపిక బుధవారం తాడిగడపలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సుజనాచౌదరిని కలిసి సాధించిన పతకాల గురించి వివరించింది. ఎమ్మెల్యే సుజనాచౌదరి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

బాపులపాడులో
హైటెన్షన్!

- నివాసాల మీదుగా 33 కేవీ, 11 కేవీ విద్యుత్ తీగలు
- దశాబ్దాలుగా వెంటాడుతున్న సమస్య
- ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకున్న గ్రామస్థులు
- సమస్యను పరిష్కరించాలని కోరినా పట్టించుకోని ప్రజాప్రతినిధులు

(హనుమాన్‌జంక్షన్ - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా.. నివాసాలు మీదుగా సాగుతున్న హైటెన్షన్ విద్యుత్ తీగలు సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బాపులపాడు గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. దశాబ్ధాలుగా ప్రాణ సంకటంగా మారిన విద్యుత్ లైన్లను తొలిగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేయాలని కోరుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఐదు దశాబ్దాల కిందట గ్రామం అభివృద్ధి చెందక పూర్వం పంట పొలాలు, ఖాళీ నివేశన స్థలాలు మీదుగా గుణదల విద్యుత్ కేంద్రం నుంచి కానుమోలు విద్యుత్ ఉపకేంద్రం నుంచి, శేరీనరసన్నపాలెం మీదుగా విజయవాడ రోడ్డు మీదుగా జంక్షన్ సబ్‌స్టేషన్‌కు 33 కేవీ, గ్రామంలో గృహ అవసరాలకు సబ్ స్టేషన్ నుంచి గ్రామంలో అనేక ప్రాంతాల్లో 11 కేవీ హైటెన్షన్ తీగలు నిర్మించారు. గ్రామం అభివృద్ధి చెందడంతో అప్పట్లో ఏర్పాటు చేసిన హెటెన్షన్ తీగలు డాబా స్లాబులు మీదుగా సాగడంతో నివాసాలు ఏర్పాటు చేసుకోవడానికి, అభివృద్ధి చేయడానికి ఆటంకంగా మారాయి. ప్రాణాపాయంగా మారాయి. పరపతి, పలుకుబడి ఉన్నవారు గృహ నిర్మాణానికి అవరోధంగా ఉన్న తీగలను పైకి లేపించు కుని గృహ నిర్మాణం చేసుకుంటున్నారు. డబ్బు పరపతిలేని సామాన్యులు ఏమి చేయలేక తీగలు కిందే ఇళ్లు నిర్మించుకోవాల్సి వస్తోంది. తీగలు సాగిన ప్రాంతాల్లో ఏరియా అభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి చందంగా మారింది. ఇళ్లు నిర్మించుకోవడానికి ఇబ్బందిగా మారడంతో స్థలాన్ని తక్కువ ధరకు తెగ నమ్ముకోవడమోలేక, ఖాళీగా వదులుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఈ రెండు లైన్లు కారణంగా గృహ నిర్మాణాలు చేసుకోలేక పోవడంతో పాటు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకోవాల్సి వస్తోంది. గతంలో తమిరి తమ్మాచారి నివాసం వద్ద కొబ్బరి మట్టలు నరుకుతూ విద్యుత్ షాక్‌తో ఒకరు మృతి చెందాడు. అదే ప్రాంతంలో వర్షాకాలంలో హైటెన్షన్ తీగలు కారణంగా ఓ ఇంట్లో విద్యుత్ షాక్‌తో గృహోపకరణాలు కాలిపోయాయి. సర్కిల్ పోలీస్ కార్యాలయం సమీపంలో డాబా మీద యువతి జామకాయలు కోస్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని జీవనం సాగించాల్సిన దుస్థితి గ్రామంలోని కొన్ని ప్రాంతాల్లో ఏర్పడింది. హైటెన్షన్ తీగల సమస్యను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కోరుతున్నారు.


బాపులపాడు నివాసాలు మీదుగా సాగిన హైటెన్షన్ విద్యుత్ తీగలు

సమస్యను ప్రభుత్వమే పరిష్కరించాలి



నివాసాలు మీదుగా సాగుతున్న హెటెన్షన్ విద్యుత్ తీగలను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన తమిరి శివప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రజాప్రతి నిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించు కోలేదని.. కూటమి ప్రభుత్వ అధికారంలోకి రావడంతో సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నట్లు తెలిపారు.

- తమిరి శివప్రసాద్


టీడీపీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ అజెండా

గుణదల, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా పార్టీ నాయకత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ప్రసాదంపాడులో నివాసం ఉంటున్న టీడీపీ కార్యకర్త ఫరూక్ కొద్ది కాలం క్రితం తెలంగాణా రాష్ట్రం ఖమ్మం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఫరూక్‌కు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం ఉందని గ్రామ టీడీపీ పెద్దలు యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన ప్రమాద బీమా మంజూరుకు చర్యలు తీసుకోవడం జరిగింది. మంజూరైన ప్రమాద బీమా రూ 5లక్షల చెక్కును ఫరూక్ కుటుంబ సభ్యులకు యార్లగడ్డ వెంకట్రావు నిడమానూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గూడవల్లి నరసయ్య, చాన్‌బాషా, బొప్పన హరికృష్ణ, దాసరి రమేష్, దాసరి గోకుల్ సాయి, గూడవల్లి రవీంద్రబాబు, ముక్కపాటి చలపతి రావు, చైతన్య, రమణ, సుభాషిణి, సంధ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ సిద్ధార్థలో నేడు రేపు డ్రోన్ ఫ్యూజన్ కార్యక్రమం

పెనమలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : స్థానిక వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో నేడు, రేపు రెండు రోజుల పాటు డ్రోన్ ఫ్యూజన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కళాశాల ఈఈఈ డిపార్టుమెంటు అసిస్టెంటు ప్రొఫెసర్ రవీంద్రనాథ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి బెంగళూరు నుంచి చీఫ్ రిమోట్ పైలెట్ ఇన్‌స్ట్రక్టర్ వాలెత్ సదాశివన్ గిరీష్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏరియల్ డ్రోన్ టెక్నాలజీ-భవిష్యత్తులో డ్రోన్ టెక్నాలజీపై మన సంసిద్ధతపై ఆఫ్‌లైన్ వర్కుషాపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మూడు కార్లు ధ్వంసం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి కోళ్ల లారీ ముందు ఉన్న కార్లను ఢీకొన్న ఘటనలో మూడు కార్లు ధ్వంసమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్తున్న ట్రావెల్స్ బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించిన రెండు కార్లకు దారివ్వకపోవడంతో ఆగ్రహించిన వారు డెల్టా షుగర్స్ ఎదురుగా వచ్చేసరికి బస్సు ముందుకువచ్చి బస్సుకు అడ్డంగా కార్లను ఆపివేశారు. డ్రైవర్‌తో వాగ్వి వాదం చోటుచేసుకుంది. ఇదే సమయంలో వెనుక ఉన్న తుమ్మల ఉదయ్ కారును నిదానించగా, అప్పుడే వెనుక నుంచి వస్తున్న కోళ్ల లారీ వరుసగా ఆగిన మూడు కార్లను ఢీ కొట్టింది. దీనితో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆగిపోయింది. ఘటనా స్థలానికి చేరుకున్న వీరవల్లి ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

పాలిసెట్‌కు శిక్షణ

గన్నవరం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు గన్నవరం ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ వివి కృష్ణమోహన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 5 నుంచి 26వ తేదీ వరకూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం స్టడీ మెటీరియల్ అందజేయటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని గన్నవరం పరిసర ప్రాంత విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీటీడీ ఉద్యోగుల నిరసన

ఉయ్యూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : అక్రమ పనిష్మెంట్లను వ్యతిరేకిస్తూ, 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని కోరుతూ బుధవారం ఉద్యోగులు నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అపరిష్కృతంగా దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు ఉయ్యూరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉద్యోగుల ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి డ్యూటీలకు హాజరయ్యారు. స్థానిక డిపో నాయకులు పీఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అపరాల కొనుగోలులో పరిమితి తొలగింపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ పరిమితి లేకుండా అపరాలు (మినుము, పెసర) కొనుగోళ్లు ఆర్బీకేల్లో జరుగుతున్నాయని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి భవాని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో అమ్మి మోసపోకుండా బాపుల పాడు మండలంలోని ఆరుగొలను, పెరికీడు రైతు సేవా కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్లే సమస్యలు

- రాబోవు ఐదారు నెలల్లో టిడ్కో ఇళ్లు పూర్తిచేసి ఇస్తాం
- త్వరలో నూతన పెన్షన్లు, రేషన్ కార్డులు
- ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉయ్యూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ అస్తవ్యస్త, అసమర్థ పాలనతో టిడ్కో ఇళ్ల నిర్మాణం, ఇతర సమస్యలు తలెత్తాయని వాటన్నింటిని అధికమించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా మంగళ వారం ఉయ్యూరు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలు తెలుసుకున్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఇవ్వక పోవడంతో అద్దెలు, బ్యాంకు నుంచి తీసుకున్న అప్పు కట్టుకోలేక ఇబ్బంది పడుతున్నామని, నూతనంగా పెన్షన్‌లు రావడంలేదని, పట్టణ పరిధిలో డ్రెయిన్, ఇతర సమస్యలు ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. త్వరలో నిధులు కేటాయించి టిడ్కో గృహాల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గతప్రభుత్వం రెండు సంవత్సరాల నుంచి నూతన పెన్షన్‌లు ఇవ్వలేదని, రానున్న రోజుల్లో నూతన పెన్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రకటించారన్నారు. నగర పంచాయతీ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కౌన్సిలర్లు, మాజీ చైర్మన్ పూర్ణచంద్రరావు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.


ఉయ్యూరు నగరపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

అభివృద్ధి చేసి చూపిస్తాం

కంకిపాడు : నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి చేసి చూపిస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో రూ. 17 లక్షలతో గాంధీ పార్కు అభివృద్ధి, రూ. 18 లక్షలతో ఎస్సీ కాలనీ ప్రధాన రహదారి అభివృద్ధికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని 42 గ్రామాలను ఈ నాలుగు సంవత్సరాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. ఉపాధి హామీ నిధులు, జనరల్, ఎమ్మెల్యే ఫండ్స్ అంటూ ఇప్పటి వరకు సుమారు రూ. 60 కోట్లతో వివిధ గ్రామాల అభివృద్ధి చేయడం జరిగిందని తెలియజేశారు. అదే విధంగా గాంధీ పార్కులో షాపులు ఏర్పాటు చేసి పంచాయతీకి ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఎంపీడీవో అనూష, పీఆర్ డీఈ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ దూళిపూడి కిషోర్, సర్పంచ్ బాకి రమణ, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, జనసేన పార్టీ ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ పులి కామేశ్వరరావు, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు సుదిమళ్ల రవీంద్ర, పులి శ్రీనివాస రావు, గొగినేని వెంకటరమణ, కొండా నాగేశ్వరరావు, ఏసుపాదం, కొన నాని, చలవాది రాజా, వణుకూరు విక్రం, బొర్రా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


పోరంకి సెంటర్లో జరిగిన నిరసన కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు

ఆప్కాస్ రద్దును ఉపసంహరించుకోవాలి

పెనమలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్ రద్దు విధానాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు ఉప్పాడ త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దుకు నిరసనగా బుధవారం తాడిగడప మునిసిపల్ కార్యాలయం వద్ద జరిగిన ర్యాలీలో పాల్గొని మాట్లాడుతూ, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా తాము గళమెత్తుతున్నామన్నారు. రద్దు చేసే పక్షంలో కార్మికులనందరినీ పర్మినెంటు చేయాలని, మునిసిపాలిటీలో ఉన్న పెండింగ్ సమస్యలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. పెనమలూరు మండల సీఐటీయూ నాయకులు ఎస్కే. మస్తాన్ వలి మాట్లాడుతూ, మునిసిపాలిటీలో త్వరలో భర్తీ చేయనున్న 150 పోస్టులను చనిపోయిన కార్మికుల కుటుంబాలలోని వ్యక్తులకు కేటాయించాలని కోరారు. ఆప్కాస్ రద్దు చేసే పక్షంలో తాము సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వై సరళ, మధిర ఏడుకొండలు, చొప్పర రత్నకరుణ, నరసయ్య, భిక్షాలు, వెంకటరెడ్డి, సాంబయ్య, బుజ్జులు, లక్ష్మి, జోజి మేరీ, కంచర్ల పద్మ, అనుమేరీ, దోమ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామిని దర్శించుకున్న
ఏపీ యాదవ కార్పొరేషన్ డైరక్టర్ మహేశ్

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఏపీ యాదవ కార్పొరేషన్ డైరక్టర్ పిన్నుబోయిన మహేశ్‌యాదవ్ బుధవారం జంక్షన్‌లో అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రలో నిర్వహించిన ప్రమాణ స్వీకారోత్సవంలో మహేశ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏలూరు జిల్లా దెందులూరు నుంచి అభిమానులు, కార్యకర్తలతో ర్యాలీగా బయలుదేరి వెళుతూ మార్గమధ్యంలో అభయాంజనేయస్వామిని దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు స్వామి వారి కండువాను బహూకరించి ఆశీస్సులు అందజేశారు.


మహేశ్ యాదవ్‌కు స్వామివారి కండువాను బహూకరిస్తున్న అర్చకులు మారేపల్లి

జంక్షన్‌లో ఎమ్మెల్సీ వీర్రాజుకు ఘన స్వాగతం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు బుధవారం స్థానిక అభయాంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించారు. స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసేందుకు రాజమండ్రి నుంచి అమరావతి వెళ్తూ మార్గమధ్యంలో జంక్షన్‌లో ఆగి ఆలయ దర్శనం చేసుకున్నారు. ఆలయ ఈవో పితాని తారకేశ్వరరావు పర్యవేక్షణలో వీర్రాజుకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. వీర్రాజుకు బీజేపీ జిల్లా కార్యదర్శి సింగవరపు భాస్కర్ గణేష్ ఆధ్వర్యంలో అభిమానులు నాయకులు, కార్యకర్తలు మేళ తాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, చిరువోలు బుచ్చిరాజు, తోట మురళీధర్, కెల్ల చింతారావు, జింకా నలగామరాజు, తాడి సత్యనారాయణ, ఎదురువాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ ఈవో

అన్నే ధనయ్యకు అభినందనల వెల్లువ

కంకిపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఉప్పలూరు గ్రామానికి చెందిన అన్నే ధనరామ కోటేశ్వరరావు (ధనయ్య)ను మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా నియమించటంతో ఆయనకు అభినందనల వెల్లువెత్తుతున్నాయి. ఉప్పలూరులోని ఆయన నివాసంలో బుధవారం తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు శేషు కుమారి, తెలుగు మహిళలు ఎం. కళ్యాణి, దండమూడి లక్ష్మీ, జనసేన వీరమహిళలు నాగశ్రీ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాసరనేని కరుణ, కర్రా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహనతోనే ఆటిజంను అధిగమిద్దాం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : జన్యుపరమైన కారణాలతో మానసిక ఎదుగుదల సరిగా లేకపోవ డాన్ని ఆటిజం సమస్యగా గుర్తించవచ్చని, తల్లిదండ్రులు సరైన అవగాహనతో కూడిన థెరపీ ద్వారా సమస్యను అధిగమించవచ్చని ఫిజియోథెరపిస్ట్ నాగమల్లేశ్వరరావు సూచించారు. వీరవల్లి భవిత కేంద్రంలో బుధ వారం ఆటిజం అవేర్నెస్ డే సందర్భంగా ఎంపీపీ స్కూల్ హెచ్ఎం ఉషారాణి, ఐఈ ఆర్‌పీ సుశీల, నాగమణిల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.



- పేరుకు మాత్రమే హైవే పెట్రోలింగ్
- వాహనాలు ఆగినా పట్టించుకోని దుస్థితి
- అక్రమ పార్కింగ్‌తో ట్రాఫిక్ కష్టాలు
- పొంచి ఉన్న ప్రమాదాలు.. గుర్తించకుంటే పెను నష్టం


వెలగని విద్యుత్ దీపాలతో చీకటిగా ఉన్న జాతీయ రహదారి


జాతీయ రహదారిపై అడ్డంగా నిలిపి ఉంచిన హైవే పెట్రోలింగ్ వాహనం.

ఇదో ట్రాఫిక్ టెర్రర్ హైవే! చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16) దేశంలో అతిపెద్ద కారిడార్లలో ఒకటి. వేలాది వాహనాలు నిత్యం ప్రయాణించే ఈ హైవేపై 'హైవే పెట్రోలింగ్' నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర సహాయ సేవల నిర్వహణలో ఘోరంగా విఫలమవుతోంది. దీంతో అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, హనుమాన్‌జంక్షన్ రూరల్


చీకటిగా ఉన్న జాతీయ రహదారి

నిశీధిలో నరకం

అంధకారంగా మారిన జాతీయరహదారిపై అధికారుల పర్యవేక్షణ శూన్యం

రహదారి భద్రత హైవే పెట్రోలింగ్ అధికారులకు ఏమాత్రం పట్టడం లేదు. చెన్నై, కోల్‌కతా జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16) అతి పెద్ద కారిడార్. నిత్యం వీఐపీలు ప్రయాణించే ఈ రహదారిపై హైవే పెట్రోలింగ్‌కు సంబంధించి అరకొర సేవలు మాత్రమే అందుతున్నాయి. జాతీయ రహదారిపై ప్రమాదం జరిగితే క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు, ట్రాఫిక్ ఆగినప్పుడు, నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు నిలపకుండా చూడటంలో హైవే పెట్రోలింగ్ పూర్తిగా విఫలమైంది. జాతీయ రహదారుల సంస్థ ఆధ్వర్యంలో వాటికోసం ఏర్పాటు చేసిన వాహనాలు గానీ, సిబ్బంది గానీ అందుబాటులో ఉండటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పెట్రోలింగ్ చేయాల్సిన వాహనాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడుకోవడమే కాకుండా జంక్షన్‌లో రోడ్డు మధ్యలోనే నిలిపి ఉంచి రహదారి భద్రతకు వారే తూట్లు పొడుస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు చూసుకుంటారనే ఉద్దేశంతో సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో జాతీయ రహదారి పక్కన డివైడర్లు కలిసే చోట్ల వాహనాలు నిలిపి ఉంచినా ఎవరూ పట్టించుకోని పరిస్థితి. ముఖ్యంగా వీరవల్లి, హనుమాన్ జంక్షన్‌కు వెళ్లేందుకు వేలేరు అడ్డరోడ్డు, బొమ్ములూరు వద్ద డివైడర్లు కనిపించకుండా భారీ వాహనాలు అడ్డుగా పెట్టినా హైవే పెట్రోలింగ్ వారికి కనబడటం లేదంటే సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా ఉంటున్నారో అర్థమవుతోందని విమర్శలు వస్తున్నాయి. ఈ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. బొమ్ములూరు, పొట్టిపాడు వద్ద గల రెండు టోల్‌గేట్‌లలో నమోదైన గణాంకాల ప్రకారం సుమారు 18వేల వాహనాలకు పైగానే ప్రతిరోజు ప్రయాణిస్తుంటాయని సమాచారం. వీటికి తోడు ఉత్తరాంధ్ర నుంచి అమరావతికి వెళ్లే వీఐపీలు ఇదే రహదారిపై ప్రయాణించాలి. మల్లవల్లి పారిశ్రామిక వాడకు వచ్చే భారీ వాహనాలు ఇదే రహదారిపై వస్తుంటాయి. అయినా సేవలు మాత్రం నామమాత్రమే. నిత్యం వేలాదిమంది ప్రజలు ప్రయాణించే జాతీయ రహదారిపై రహదారి భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం గర్హనీయం. తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రయాణికులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు శూన్యం

ఎ. సీతారాంపురం, కోడూరుపాడు, వీరవల్లి, ఎస్.ఎన్. పాలెం, పెరికీడు వద్ద అండర్‌పాస్‌లలో అడ్డదిడ్డంగా లారీలు నిలపేసి ఉంచుతారు. బొమ్ములూరు, వీరవల్లి, వేలేరు అడ్డరోడ్డు వద్ద అనుసంధానమయ్యే ప్రధాన రహదారులపై అడ్డుగా లారీలు, భారీ వాహనాలు నిలిపి ఉంచినా పట్టించుకోకపోవడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. బస్సు లు, కార్ల వంటి వాహనాలు సర్వీసు రోడ్‌లోకి వెళ్లేందుకు మలుపు తీసుకోవడం కష్టంగా మారుతోంది. స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంద రు సిబ్బంది హోటళ్ల నిర్వాహకుల వద్ద నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జాతీయ రహదారి చీకటిమయం

చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై బొమ్ములూరు టోల్‌ప్లాజా నుంచి పొట్టిపాడు టోల్‌ప్లాజా దాటాక సిద్ధార్థ వైద్య కళాశాల వరకూ కొన్నిరోజులుగా విద్యుత్ దీపాలు వెలగక అంధకారంగా మారింది. 20 కిలోమీటర్లకు పైగా ఉన్న జాతీయ రహదారిపై రెండువైపులా ఏర్పాటు చేసిన భారీ లైట్లు వెలగకపోవడంతో ముందు వెళ్లే వాహనాలు, రోడ్డుదాటే పాదచారులకు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్లోనూ విద్యుత్ దీపాలు వెలగక ఆయా గ్రామాల ప్రజలు అంధకారంలోనే రాకపోకలు సాగిస్తున్నారు. విద్యుత్ బిల్లు చెల్లించకపోవడంతో విద్యుత్ శాఖ సరఫరా నిలిపివేసినట్టు సమాచారం. దీంతో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదని మొత్తుకుంటున్నా అధికారుల తలకెక్కడం లేదు. దీంతో కోడూరుపాడు కూడలి వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాను కూడా దుండగులు తస్కరించారు. ఇప్పటికే ఈ సమస్యపై ఎన్‌హెచ్ సంస్థకు ఎస్సై స్థాయి అధికారి ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.

నివారణ చర్యలు ఏవి?

నిరంతర గస్తీ ముమ్మరం చేస్తూ నిబంధనలకు విరుద్ధంగా అండర్‌పాస్‌లలో వాహనాలు నిలిపినా, జాతీయ రహదారిపై వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆయా వాహన చోదకులకు కౌన్సెలింగ్, జరిమానా విధించేలా చర్యలు తీసుకోవాలి. అత్యవసర వాహనాలను టోల్‌గేట్ల వద్ద అలంకారప్రాయంగా కాకుండా బ్లాక్‌స్పాట్‌లు (ప్రమాదకర పాయింట్లు) 3 చోట్ల అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. భారీ వాహనాలు ఏమైనా ఆగిపోతే తక్షణం స్పందించి క్రేన్ల సాయంతో రహదారి పక్కకు లేదా దగ్గరలోని ఖాళీ ప్రదేశంలో చేర్చేలా మూడు క్రేన్లను రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఉంచాలి. హైవే సిబ్బంది ఎక్కడి వెళ్లింది జీపీఎస్ సాయంతో ఎప్పటికప్పుడు సమాచారం వచ్చేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలి.

లైట్లు లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయి

సూర్యనారాయణ, ఉద్యోగి, కోడూరుపాడు.

జాతీయ రహదారిపై లైట్లు లేక చీకటిగా ఉండటంతో ముందు వెళ్లే పాదచారులు, సైకిలిస్టులు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. తాను విధులు ముగించుకుని వెళుతూ ప్రమాదానికి గురై చేయి ఫ్రాక్చరై 2నెలల పాటు జీతం కోల్పోయా. జాతీయ రహదారిపై ఉమామహేశ్వరపురం, కోడూరుపాడు, ఎ.సీతారాంపురం, వీరవల్లి, అంపాపురం వద్ద గ్రామాల ప్రజలు దినసరి పనులకు తప్పనిసరిగా జాతీయ రహదారి దాటాల్సిన పరిస్థితి. సర్వీస్ రహదారుల్లోనూ లైట్లు వెలగకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

బాలికపై అక్కభర్త అత్యాచారం

పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బాలికపై సొంత బావ అత్యాచారం చేసిన ఘటనపై చిల్లకల్లు పోలీసులు బుధవారం పోక్సో, రేప్ కేసు నమోదు చేశారు. మండలంలోని రెడ్యానాయక్ తండ గ్రామానికి చెందిన బాలికను తన అక్క భర్త త్రిపువరం గ్రామానికి చెందిన నిందితుడు వత్సవాయి మండలం కన్నెవీడు గ్రామంలో మిర్చికోతకు తీసుకెళ్లాడు. ఆమెకు మాయమాటలు చెప్పి అక్కడి నుంచి హైదరాబాద్ తీసుకెళ్లి దాదాపు 20 రోజుల పాటు శారీరకంగా అనుభవించి గ్రామానికి తీసుకొచ్చాడు. గ్రామ పెద్దలు, ఇరువర్గాలు ఒకే కుటుంబానికి చెందినవారు కావటంతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని చెప్పటంతో తాత్కాలికంగా సద్దుమణిగింది. మార్చి 25న నిందితుడు మళ్లీ బాలిక ఇంటికెళ్లి తన వద్ద ఫొటోలున్నాయని, బయటపెడతానని భయభ్రాంతులకు గురిచేయటంతో బాలిక పురుగుమందు తాగింది. కుటుంబ సభ్యులు చిల్లకల్లు పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్, కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు నిమిత్తం సీఐ వెంకటేశ్వర్లు, నందిగామ ఏసీపీ తిలక్‌కు సమాచారం అందించారు. కాగా నాగరాజుకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. వత్సవాయి పోలీస్ స్టేషన్‌లో బాలిక మిస్సింగ్ కేసు కూడా నమోదై ఉంది.

పెనమలూరులో కిడ్నాప్ కలకలం

● ఆర్థిక లావాదేవీలే కారణం..?

పెనమలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో బుధవారం సాయంత్రం ఒక వ్యక్తి కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. పోరంకి నారాయణపురం కాలనీకి చెందిన జే వెంకటేశ్వరరావు, నగరంలో ఉండే గాడి రాజులు వ్యాపార భాగస్వాములు. వీరి మధ్య కొంతకాలంగా గొడవలొచ్చాయి. బుధవారం రాజు తన మనుషులతో వెంకటేశ్వరరావు ఇంటికి వచ్చి చర్చించాడు. కుదరకపోవడంతో రాజు తన మనుషతో వెంకటేశ్వరరావును కారులో ఎక్కించుకొని సత్యనారాయణపురానికి తీసుకెళ్లారు. ఈ ఘటన వెంకటేశ్వరరావు కుమార్తె డూండీప్రియ చూసింది. రాజు మనుషులు డూండీప్రియకు ఫోన్ చేసి మీ నాన్ని మాకు ఇవ్వాల్సిన డబ్బు కట్టి తీసుకెళ్లమని చెప్పారు. దీంతో అప్రమత్తమైన ఆమె పోలీసులను ఆశ్రయించింది. పెనమలూరు సీఐ వెంకటరమణ సిబ్బందితో ఎన్‌క్వైరీ చేయించగా వారు సత్యనారాయణపురంలో ఉన్నట్టు తేల్చారు. అక్కడి పోలీసులు, పెనమలూరు సిబ్బంది కారును ట్రేస్ చేసి కిడ్నాప్ కథకు ముగింపు పలికారు. కిడ్నాప్ చేసిన వ్యక్తులు పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం.

పర్యాటక ప్రదేశంగా నవలంక!

● పరిశీలించిన పర్యాటక శాఖ అధికారులు



చుట్టుపక్క ప్రాంతాల గురించి తెలుసుకుంటున్న పర్యాటక శాఖ ప్రాంతీయ అధికారిణి వైవీ ప్రసన్నలక్ష్మి, ప్రత్యేక పడవలో అధికారులు

నాగాయలంక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శ్రీ రామ పాద పుష్కర ఘాట్‌లో కృష్ణానది మధ్యలో విశాలంగా ఉన్న నవలంకను పర్యాటక రంగంగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటక శాఖ ప్రాంతీయ అధికారిణి వైవీ ప్రసన్నలక్ష్మి తెలిపారు. కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అభీష్టం మేరకు డీఆర్వో కె.చంద్రశేఖర్, పర్యాటక శాఖ జిల్లా అధికారి రామలక్ష్మణ్, స్థానిక అధికారులతో కలిసి బుధవారం పర్యాటక ప్రాంతీయ అధికారిణి 16 ఎకరాల విస్తీర్ణంలోని ఇసుక దిబ్బలుగా ఉన్న నవలంకను పుష్కరఘాట్ నుంచి ప్రత్యేక పడవలో వెళ్లి పరిశీలించారు. నవలంకలో సందర్శకులు కోసం ఏఎంసీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన 8 సిమెంట్ బల్లలను, ఎండ రక్షణ కోసం కట్టిన తాటాకుల గొడుగులను చూశారు. నవలంక చుట్టుపక్కల ఉన్న సహజ వాతావరణంలోని వివరాలను ఆమె తహసీల్దార్ ఎం.హరనాథ్‌ని అడిగి తెలుసుకున్నారు. పర్యాటక రంగం మార్గదర్శకాలకు అనువైన వాతావరణం నవలంకలో ఉన్నాయని, కొంత స్థల సేకరణ చేయాల్సి ఉంటుందని వివరించారు. ఇక్కడికి వలస పక్షులు వచ్చే అవకాశాలున్నాయా అడగ్గా, లేవని తహసీల్దార్ చెప్పారు. నవలంకలోని పరిసర ప్రాంతాలను ఆమె పటం ద్వారా చూసి తెలుసుకున్నారు. ఘాట్ చెంతన జలక్రీడల అకాడమీ భవనం నిర్మాణ దశలో ఉందని, మత్స్యకారుల కోసం నిర్మిస్తున్న భవనం ఆగిపోయిందన్నారు. కృష్ణానదిలో ఎప్పుడూ బ్యాక్ ఉంటుందన్నారు. 25 కిలోమీటర్ల దూరంలో గుల్లలమోద లైట్‌హౌస్ ఉందని, పర్యాటక రంగానికి ఈ ప్రాంతం ఎంతో దోహదపడుతుందని తహసీల్దార్ అధికారులకు వివరించారు. నవలంకను అధికారులతో ఆమె గంట సేపు కలియ తిరుగుతూ సూర్య కిరణాలు పడి మెరుస్తున్న నవలంకలోని ఇసుక తిన్నెలను పరిశీలించారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రాంతాన్ని పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్టు ఆమె పాత్రికేయులకు తెలిపారు. తొలుత నవలంకకు రాగానే నది పైనుంచి వచ్చే చల్లటి గాలులకు, చక్కటి వాతావరణం చూసి అధికారులు తన్మయత్వం చెందారు. అనంతరం పడవను ఎక్కి వక్కపట్లవారిపాలెం పుష్కరఘాట్, పల్లెపాలెం పుష్కరఘాట్ ఒడ్డునున్న ప్రదేశాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా జలక్రీడల విద్యార్థి నాగిడి గాయత్రి కృష్ణానదిలో ప్రాక్టీక్ చేస్తుండగా, అధికారుల వద్దకు వచ్చి ఆమె పరిచయం చేసుకున్నారు. ఆమెను అధికారులు అభినందించారు. సాయంత్రం ఎదురుమొండి పంటు ప్రదేశాన్ని, ఎదురుమొండి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. తూము వెంకటేశ్వరరావు, అబ్దుల్ రఫీ, తలశిల రఘుశేఖర్, బి.రామలింగేశ్వరరావు, పూషడపు కనకదుర్గ, అజయ్ కుమార్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● సీఎం పర్యటన నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



చందర్లపాడు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి పర్యటన విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలకు మండలంలోని ముప్పాళ్ల గ్రామానికి సీఎం వస్తున్న విషయం విదితమే. ఈక్రమంలో బుధవారం ముప్పాళ్లలోని శ్రీవెంకటేశ్వర కల్యాణ మండపంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ముప్పాళ్ల గ్రామానికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా ఎస్సీ, బీసీ వర్గాలకు అమలౌతున్న పథకాలను తెలుసుకున్నారు. వ్యవసాయం, హార్టికల్చర్, విద్య, వైద్యశాఖలపై నిశిత పరిశీలన చేశారు. గ్రామంలో పాడి గేదెల సంఖ్య, పాల దిగుబడి, ఆదాయ వివరాలు తెలుసుకున్నారు. పర్యటన ఆద్యంతం అన్ని కేటగిరీల అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 స్టాల్స్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తించిన పీ4 లబ్ధిదారులకు ఆదాయం ఎలా పెంచాలన్న అంశంపై సమీక్ష జరపాలన్నారు. సీఎం నేరుగా ప్రజలతో మాట్లాడి దరఖాస్తులు స్వీకరిస్తార న్నారు. ఈ ప్రజాదర్బార్ వద్ద అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నందిగామ ఆర్‌డీవో కే బాలకృష్ణ, ఏసీపీ ఏబీజీ తిలక్, డీపీవో లావణ్యకుమారి, సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ, జిల్లా సంక్షేమ అధికారి శ్రీనివాస శిరోమణి, జడ్పీ సీఈవో కన్నమ నాయుడు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న ముప్పాళ్ల

ముఖ్యమంత్రి చంద్రబాబు రాకకు ముప్పాళ్ల గ్రామం ముస్తాబవుతోంది. గ్రామంలో రోడ్ల వెంట చెత్తచెదారం ఎత్తివేయడంతో పాటు కంప చెట్లు కొట్టి వేస్తున్నారు. రహదారులతో పాటు అంతర్గత రోడ్లను సుందరీకరిస్తున్నారు. ఎస్కవేటర్ల, డోజర్ల సాయంతో రోడ్లన్నీ శుభ్రపరుస్తున్నారు. బుధవారం ఉదయం నుంచే కార్మికులు రోడ్లను శుభ్రం చేస్తున్నారు. తమ అభిమాన నేత తొలిసారి ముప్పాళ్ల వస్తుండడంతో కూటమి నేతలతోపాటు ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గుత్తవారిపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డులోని వ్యవసాయ భూమిని శరవేగంగా చదును చేస్తున్నారు. అధికారులతో పాటు స్థానిక టీడీపీ నేతలు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. మొత్తం మీద సీఎం చంద్రబాబు రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

మాజీ మంత్రి కొడాలి నానికి బైపాస్ సర్జరీ సక్సెస్

గుడివాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): గుడివాడ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొడాలి నానికి బైపాస్ సర్జరీ సక్సెస్ అయిందని ఆయన సన్నిహితులు తెలిపారు. బుధవారం ముంబైలోని ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్‌లో చీఫ్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండే నేతృత్వంలో నిర్వహించిన సర్జరీ సక్సెస్ అయింది. సుమారు 8 గంటల పాటు వైద్యులు సుదీర్ఘంగా సర్జరీలో పాల్గొన్నారు. ప్రస్తుతం నాని వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని వారు పేర్కొన్నారు.

కేడీసీసీబీ టర్నోవర్ రూ.11,307.14 కోట్లు

● చైర్‌పర్సన్, జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా సహకార కేంద్రబ్యాంక్ (కేడీసీసీబీ) వ్యాపారంలో ముందుకు సాగుతోందని కేడీసీసీబీ చైర్‌పర్సన్, జేసీ గీతాంజలిశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25లో బ్యాంకు షేర్ క్యాపిటల్‌ను రూ.370.70 కోట్ల నుంచి రూ.418.50 కోట్లకు పెంచినట్టు తెలిపారు. డిపాజిట్ల సేకరణ రూ.3,094.40 కోట్ల నుంచి రూ.3,265.94 కోట్లకు చేరిందన్నారు. గత ఏడాది రూ.170.79 కోట్లు పెరిగిందన్నారు. కేడీసీసీబీ ద్వారా పంటరుణాలతో పాటు వివిధ రకాల రుణాలు రూ.7,955.42 కోట్ల నుంచి రూ. 8,041.94 కోట్లకు పెంచడం జరిగిందన్నారు. మొత్తంగా బ్యాంకు టర్నోవరు రూ.11,049.82 కోట్లనుంచి రూ.11,307.14 కోట్లకు చేరిందన్నారు. జిల్లాలోని 425 పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేస్తున్నామని, ఇప్పటికి 314 పీఏసీఎస్‌లు పూర్తయ్యాయన్నారు. కేడీసీసీబీలో 66 మంది స్టాఫ్ అసిస్టెంట్లను నియమించేందుకు నోటిఫికేషన్ జారీ చేశామని, త్వరలో ఐబీపీఎస్ ద్వారా పరీక్ష నిర్వహిస్తామన్నారు. 2024 నవంబరు 26న ఢిల్లీలో జరిగిన సదస్సులో కేంద్రహోం, సహకారశాఖల మంత్రి అమిత్‌షా చేతుల మీదుగా కేడీసీసీబీ బెస్ట్ పెర్మార్మింగ్ బ్యాంకు అవార్డును అందుకుందన్నారు. బ్యాంకు లాభాల నుంచి 6శాతం డివిడెంట్‌ను ఏటా పీఏసీఎస్‌లకు ఇస్తున్నట్టు జేసీ తెలిపారు.

వృక్షంపై కక్ష కత్తి..!

● ఆర్ అండ్ బీ బంగ్లాలో చెట్లను నరికివేయించిన అధికారులు

జగ్గయ్యపేట, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వృక్షో రక్షితః రక్షితః అంటూ మైకుల్లో ఉపన్యాసాలిచ్చే అధికారులు వాస్తవంలో మాత్రం వృక్షాలపై కత్తి పెడుతున్నారు. పట్టణంలో ఆర్ అండ్ బీ బంగ్లాలో పురాతన చెట్లను అధికారులు నరికివేయటం విమర్శల పాలైంది. 80, 90 ఏళ్లున్న చెట్లను ఎందుకు కొట్టి వేయించారో అంతుపట్టకుండా ఉంది. దీనిపై ఆర్ అండ్ బీ డీఈ పరశురాం వివరణ కోరగా తాను సీఎం ముప్పాళ్ల పర్యటనలో బిజీగా ఉన్నానన్నారు.


ప్రమాణస్వీకారం చేస్తున్న బెజవాడ బార్ ఈసీ మెంబర్లు

'బార్' కార్యవర్గసభ్యుల ప్రమాణం

విజయవాడ లీగల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బార్ అసోసియేషన్‌లో నూతనంగా నియమితులైన 25మంది ఈసీ మెంబర్లు, నూతన కార్యవర్గసభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో సీనియర్ న్యాయవాదుల కేటగిరిలో పడవల ఏడుకొండలు, దిగువ కేటగిరికి చెందిన న్యాయవాదుల్లో కాళహస్తి పద్మజ, జి. జయలక్ష్మి, స్వామి, జేవీ కార్తీక్‌బాబు, జంగా జయలక్ష్మి తదితరులున్నారు. వీరితో పాటు బార్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.కె.బాషా, జనరల్ సెక్రటరీ కె.వి.రంగారావు, ఉపాధ్యక్షుడు పిళ్లా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ జీవీ లక్ష్మీ, ట్రెజరర్ ఎం.సత్యనారాయణ, లైబ్రేరియన్ సెక్రటరీ కె.త్రినాథ్, స్పోర్ట్స్ సెక్రటరీ రవిబాబు, మహిళా సెక్రటరీ కె.అనురాధ పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు బార్ ప్రెసిడెంట్ చిదంబరం, అసిస్టెంట్ అడ్వకేట్ జనరల్ సాయిప్రతాప్, బార్ కౌన్సిల్ మెంబర్లు చలసాని అజయ్‌కుమార్, సుంకర రాజేంద్రప్రసాద్, బార్ మాజీ అధ్యక్షుడు వి.గురునాథం, సంపర శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కన్నతండ్రి కర్కశత్వం

● కుమారుడిపై దాడి.. పోలీసులను ఆశ్రయించిన తల్లి

పెనమలూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తాను చెప్పినట్టు వినడంలేదని ఓ తండ్రి సొంత కుమారుడిని బలమయిన కర్రతో దాడి చేయడంతో 6వ తరగతి చదువుతున్న ఒక బాలుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో తల్లి శంషాద్ పెనమలూరు పోలీసులను ఆశ్రయించింది. కానూరు సనత్‌నగర్‌కు చెందిన మస్తాన్, శంషాద్ భార్యాభర్తలు. వారికిద్దరు మగపిల్లలు. చిన్న కుమారుడు పర్హాన్ దగ్గర్లోని పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ఒంటిపూట బడులు కావడంతో ఆడుకోవడానికి స్నేహితులతో కలిసి వెళ్లాడు. అంతకు ముందు ఎక్కడికీ వెళ్లవద్దని కుమారుడికి చెప్పి వెళ్లిన తండ్రి మస్తాన్ తన మాట వినలేదనే కోపంతో బలమైన కర్రతో చావబాదాడు. దీంతో బాలుడికి మణికట్టు, చేతిభుజంపై వాతలు తేలాయి. దీంతో కడుపు రగిలిపోయిన తల్లి తన కుమారుడిని, బంధువులను తీసుకొని పోలీసులను ఆశ్రయించింది. గతేడాదీ ఇలాగే కొడుకును చావబాదాడని తల్లి కన్నీరుమున్నీరైంది.

హామీలు నెరవేర్చకుంటే మరో ఉద్యమం

● నిరసనలో పలువురు నేతలు



ధర్నాలో పాల్గొన్న నేతలు

ధర్నాచౌక్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర నేత నక్కా వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ధర్నాచౌక్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. తక్షణమే 12వ పీఆర్సీకి చైర్మన్‌ను నియమించాలని అప్పటిలోగా ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. రూ.25 వేల కోట్ల ఆర్థిక బకాయిల చెల్లింపులపై రోడ్‌మ్యాప్ ప్రకటించాలన్నారు. ఏపీటీఎఫ్ మాజీ ప్రధానకార్యదర్శి పాండురంగ ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే మరో బీఆర్టీఎస్ రోడ్డు ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా చైర్మన్ అలవాల సుందరయ్య మాట్లాడుతూ 2022 నుంచి పెండింగ్‌లోని సరెండర్ లీవ్ బకాయిలు, గ్రాట్యూటీ చెల్లింపులకు నిధులు విడుదల చేయాలన్నారు. ప్రధానకార్యదర్శి ఇంటి రాజు మాట్లాడుతూ 2004కు ముందు నియమాకాలు పొందిన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో రాష్ట్ర నేత నాగరాజు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	153, 162, 173
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

శ్రీరామనవమి వేడుకలకు సర్వం సిద్ధం

గుడివాడ, ఏప్రిల్ 02(ఆంధ్రజ్యోతి) : స్థానిక రాజేంద్రనగర్‌లోని టీటీడీ కల్యాణ మండపంలో 15వ సీతారాముల కల్యాణ మహోత్సవాలను ఈ నెల 6వ తేదీన నిర్వహిస్తున్నట్టు భక్తబృందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఉదయం 8 గంటలకు సామూహిక విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణ జరుగుతుంది. స్వామి కల్యాణం అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బ్రహ్మశ్రీ కపలవాయి లీలరంగసాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించబడుతుందని భక్తబృందం తెలిపింది.


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పల్లె పండుగతో గ్రామాల అభివృద్ధి

కూచిపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో రహదారులు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. కాజ నుంచి మందపాలెం వెళ్లే సీసీ రహదారిని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లింగమనేని రామలింగేశ్వరరావు, తాతా నారాయణ రావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, మురారి కిషోర్, రాయవరపు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చడంలో చలివేంద్రాలు మేలు

గుడివాడ : స్థానిక బేతవోలు పార్కు సెంటర్‌లో జనసేన ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బుధవారం జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేతవోలులో జనసేన నాయకులు కంచనపల్లి సీతారాం, బుడమ రాజుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. టీడీపీ, జనసేన నాయకులు పోలాసి ఉమా, పొలగాని కృష్ణ, విశ్వనాథ్, తిరుపతి, చీకటి సూర్యనారాయణ, మజ్జి శ్రీనివాసరావు, సాయన రాజేష్, మీరా షరీఫ్, గుండు వెంకట్రావు, సుబ్రహ్మణ్యం, శివ, రవికుమార్, వెంకటేశ్వరరావు, శేషం మురళీ, బోయిన చంటి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం

● జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ


సంగలూరు పాఠశాలలో ..

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్యనందించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ పేర్కొన్నారు. బుధవారం సింగలూరు లోని ప్రాథమిక పాఠశాలలో ఆయన విద్యార్థుల తల్లులతో మాట్లాడారు. ఇద్దరు ఉపాధ్యాయులతో చదువు పూర్తిస్థాయిలో న్యాయం జరగదని తరగతికి ఒక ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థికి విద్య ఉత్తమ ప్రామాణాలలో అందుతుందన్నారు. అనంతరం గ్రామంలోని వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పామర్రు: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల పునర్వ్యవస్థీకరణ అమలకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని జిల్లా కలెక్టర్ డీకేబాలాజీ అన్నారు. బుధవారం పామర్రులోని నాలుగు ఎంపీపీ పాఠశాలలతోపాటు మండలంలోని పెదమద్దాలి ఎస్సీకాలనీలోగల ప్రభుత్వ పాఠశాలలను స్థానిక ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజాతో కలసి సందర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుకోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వారి తల్లులకు వివరించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యపరంగా ముందుకు సాగాలంటే విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను అందిపుచ్చుకునేలా అందరూ సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ప్రయివేటు పాఠశాలలకు తీసిపోనీ నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనంతరం ఎంఈవో కార్యాలయం వద్దగల గంగానమ్మ తాగునీటి చెరువును ఆయన పరిశీలించారు. తక్షణమే చెరువు చుట్టుపక్కలగల జంగిల్ క్లియర్ చేయాలని, సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, డీవైఈవో పద్మరాణి, ఎంపీడీవో కెజ్యోతి,ఎంఈవో గుమ్మడిపద్మవాణి, కార్యదర్శి అబ్దుల్‌సలీం, మండల టీడీపీ అధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, మంతెనరామంజనేయులు, శానిటరిఅధికారి సుధాకర్, ఈవోపీఆర్‌డీ కిషోర్ లు పాల్గొన్నారు.


పెదపారుపూడిలోని ప్రాథమిక పాఠశాలలో..


పెదమద్దాలి ఎంపిపి పాఠశాలలో ..

పెదపారుపూడి: పెదపారుపూడి మండలంలో మహేశ్వరాపురం, భూషణగుళ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను బుధవారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజాతో కలసి సందర్శించారు. డీఈవో రామారావు, గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఎంఈవో శ్రీనివాస్, సురేష్, తహసీల్దార్ వై.రంగారావు, ఎంపిడివో టీ.సీతామహాలక్ష్మి, ఈవోపిఆర్‌డి వంగా శ్రీనివాసరావు, నీటి సంఘం కార్యదర్శి డి సిహెచ్.శ్రీనివాసరావు, అధ్యక్షుడు చలసాని నవీన్ చౌదరి పాల్గొన్నారు.

గుడివాడ రూరల్: తట్టివర్రు, బొమ్ములూరు, చిరుచింతల యుపి పాఠశాలలను యథాతథంగా కొనసాగించాలని జిల్లా కలెక్టర్ బాలాజీ అన్నారు. బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి రామారావుతో కలసి తట్టివర్రు యుపి పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. మండలంలో చిరుచింతల, బొమ్ములూరు పాఠశాలలను ఆ విధంగానే ఉంచుతామని తెలిపారు. ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్, ఎంఈవో బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఉచిత కోచింగ్ నేటి నుంచే

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాలిసెట్ ఉచిత కోచింగ్ గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎం అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్ పాఠశాలలో ఏప్రిల్ 3 గురువారం నుంచి తరగతులు నిర్వహించనున్నామని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ తెలిపారు. పదోతరగతి పూర్తిచేసిన విద్యార్థులు పాలిసెట్ ఎంట్రన్స్ పరీక్షల్లో ఉత్తీర్ణులై పాలిటెక్నిక్ లో చేరవలసి ఉంది. మండలంలోని పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు తమ పాలిటెక్నిక్‌లో ఉచిత కోచింగ్‌ను ఇవ్వనున్నామని ఆయన తెలిపారు. శిక్షణలో గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం వంటి ముఖ్య విషయాలపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. శిక్షణ వివరాను తెలుసుకో దలచిన వారు నేరుగా పాలిటెక్నిక్ కళాశాలకువచ్చి, లేదా 7997508931, 7997132636 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని చెప్పా రు. ముందుగా నమోదు చేసుకున్న విద్యార్థులకు మాత్రమే శిక్షణకు ప్రవేశం ఉంటుందని తెలిపారు. పాలీసెట్ 2025 ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 30న నిర్వహించనున్నారని పరీక్ష రాయదలిచిన విద్యార్థులు ఓసీ,బిసీలకు రూ. 400 లు, ఎస్సీఎస్టీ విద్యార్థులకు రూ. 100 పరీక్ష ఫీజు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఫీజు ఏప్రిల్ 15 లోగా ఆన్‌లైన్‌లో పాలీసెట్ ఏపీ వెబ్‌సైట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

వృద్ధులకు అన్నదానం, చీరల పంపిణీ

గుడివాడ, ఏప్రిల్ 02(ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా కలవలపల్లి గ్రామస్థులు తాతా సాయి మురళీకృష్ణ, మోహన నాగలక్ష్మీ దంపతులు పెళ్లిరోజు సందర్భంగా బుధవారం స్థానిక శాంతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు షుట్టి హరికుమార్, సభ్యులు తిరుపతయ్య, రామారావు, తాతారావు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకు అభినందన సభ


అట్లూరి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న ఎన్‌జీవో నేతలు

గుడివాడ రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావు 33 సంవత్సరాలు నిజాయితీ, నిబద్ధతతో పని చేశారని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వి.సత్యనారాయణ అన్నారు. బుధవారం ఎన్‌జీవో హోమ్‌లో పదవీ విరమణ చేసిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అట్లూరి వెంకటేశ్వరరావుకు ఆత్మీయ అభినందన సత్కార సభ గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ గుడివాడ సబ్ డివిజన్ వారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ పదవీవిరమణ ముందుగానే చేయటం బాధగా ఉందన్నారు. డిపార్ట్‌మెంట్‌లో ఎప్పుడూ అందరికీ అందుబాటులో ఉండేవాడని కొనియాడారు. ప్రస్తుత సిబ్బంది నిజాయితీ, నిబద్ధత, బాధ్యతాయుతంగా పని చేసి ప్రజల మన్ననలు పొందాలని కోరారు. ఏఈ ప్రశాంతంగా కుటుంబసభ్యులతో గడపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీవో ప్రెసిడెంట్ కె.పి.రావు, వివిధ శాఖల అధికారులు, యూనియన్ నాయకులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయొద్దు : సీపీఎం


వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ, ఏప్రిల్ 02(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించిన స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను నేటి కూటమి ప్రభుత్వ కొనసాగిస్తోందని, ఇప్పటికే వాణిజ్య కేంద్రాల్లో మీటర్లను బిగించారని, ఇళ్లకు స్మార్ట్ మీటర్లను బిగించకుండా వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి కోరారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి తిరిగి స్టిక్కర్‌లను అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.15వేల కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ సంస్థకు ముందుగానే డబ్బులు చెల్లించాలన్నారు. పీక్‌టైంలో చార్జీలను ఎక్కువగా వేస్తారని, మీటర్ల ఖర్చుకూడా ప్రజలే భరించాలని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.రజిని, ఆర్.కొండ, బండి శ్రీను, ఎల్.సురేంద్ర, నగీన, భాషా, చిన్న, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రహదారి వెంబడి నరికివేసిన చెట్లు

మొక్కల నరికివేత

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) :గుడ్లవల్లేరులో ఎంఅండ్‌కే ప్రధాన రహదారి వెంబడి మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న పచ్చని చెట్లను నూతన విద్యుత్ 33 కేవీ లైన్ల నిర్మాణానికి అడ్డు వస్తున్నాయని విద్యుత్‌శాఖ సిబ్బంది దాదాపు 20 చెట్లను నరికేశారు. విద్యుత్ లైన్లకు అడువస్తాయంటే కొమ్మలు రెమ్మలు తొలగించాలి కానీ ఏకంగా మొండాలె మిగిలేలా మొక్కలను నరికేశారు. వర్షాకాలంలో అయితే తిరిగి మోడులు చిగురిస్తాయి కానీ మండు వేసవిలో నరికేశారు. రహదారి విస్తరణ అనంతరం గుడ్లవల్లేరు నెహ్రూ పశువుల సంత , గ్రామాభివృద్ధి సంఘం వారు ఈ మొక్కలను నాటి రెండేళ్లపాటు ఐటీఐ విద్యార్థులు ఆమొక్కలకు రోజూ నీళ్లుపోసి పెంచారు. బాగా ఎదిగి బాటసారులకు నీడనిస్తున్న సమయంలో అభివృద్ధి పేరట నరికేశారు.


చెత్తకుప్పలు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

చెత్తకుప్పల తొలగింపు

పమిడిముక్కల: మంటాడ- లంకపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డులో రెడ్డిపాలెం సమీపాన పేరుకుపోయిన చెత్త కుప్పలు పంచాయతీ సిబ్బంది బుధవారం తొలగించి శుభ్రపరిచారు. రోడ్డు వెంబడి చెత్తకుప్పలు పేరుకుపోయి, రోడ్డుపై వెళ్లేవారికి అసౌకర్యంగా ఉన్న నేపథ్యంలో డంపింగ్‌యార్డులా ఆర్‌అండ్‌బీ రోడ్డు శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన మంటాడ పంచాయతీ అధికారులు చెత్త కుప్పలు తొలగించి శుభ్రంచేశారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ ప్రచార ఉద్యమం

కూచిపూడి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ ప్రచార ఉద్యమం చేపట్టింది. ఇందులో భాగంగా కూచిపూడిలో ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రచార ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు, ప్రయాణీకులకు, బాటసారులకు కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. పెట్రోల్, డీజిల్, నిత్యావసరాలు, విద్యుత్ చార్జీలను ఇబ్బడిముబ్బడిగా పెంచి సామాన్య మధ్యతరగతి ప్రజలపై ఎన్డీఏ కూటమి పెనుభారం మోపిందని నేతలు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు గుత్తికొండ రామారావు, అడ్డాడ ప్రసాద్ బాబు, చెరకు శ్రీనివాసరావు, చందోలు నాగేశ్వరరావు, కొండా నాగేశ్వరరావు, మోదుమూడి సద్గుణరావు, లంకా నాగవల్లి, సిద్ధాబత్తుల వాసు పాల్గొన్నారు.

భూముల రీ సర్వేకు రైతులు సహకరించాలి

● తహసీల్దార్ ఎం. కుసుమ కుమారి


సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ కుసుమకుమారి

తోట్లవల్లూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : భూముల రీ సర్వే రైతులకు ఎంతో మేలని తహసీల్దార్ ఎం. కుసుమ కుమారి అన్నారు. చాగంటిపాడులో బుధవారం భూముల రీ సర్వేపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభను నిర్వహించారు. చాగంటిపాడు పరిధిలో 226 సర్వే నెంబర్లలో 2,800 ఎకరాల భూములున్నాయని, ఇందులో 985 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూములను రీ సర్వే చేసి హద్దులు వేయటం జరుగుతుందని తహసీల్దార్ కుసుమకుమారి తెలిపారు. దీనివల్ల రైతులకున్న సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. రైతులందరూ అధికారులకు సహకరించి రీ సర్వేని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మర్రెడ్డి శేషిరెడ్డి, వైస్ ఎంపీపీ కళ్లం సాంబశివారెడ్డి, రీ సర్వే డీటీ వెంకటేశ్వరరావు, వీఆర్వో కె. బాలకోటయ్య, విలేజ్ సర్వేయర్ షేక్ మైనిషా తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారునికి హైదరాబాద్‌లో పింఛన్ అందజేత


పింఛన్ అందిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్

కూచిపూడి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన దివ్యాంగ పెన్షన్ దారుడు యార్లగడ్డ లక్ష్మయ్య హైదరాబాద్‌లో వైద్యసేవలు పొందుతుండటంతో అధికారుల సూచనలతో ఆ గ్రామ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ టి.సురేష్ హైదరాబాద్ వెళ్లి లబ్ధిదారునికి పింఛన్ అందజేశారు. రెండు నెలలకుగాను రూ.12 వేలు నగదు , ఆయన భార్య కనకదుర్గకు సైతం రెండు నెలల వృద్ధాప్య పింఛన్ రూ.8 వేలు కలిపి రూ.20 వేలు అందించటంతో ఆ వృద్ధదంపతుల ఆనందానికి అవదుల్లే కుండాపోయాయి. ఎండీవో జె.విమాదేవి, పంచాయతీ కార్యదర్శి ఎం.ఎస్.ఎన్.మూర్తి వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్‌కు అభినందనలు తెలిపారు.

గుడివాడ నుంచి భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

గుడివాడ, ఏప్రిల్ 02(ఆంధ్రజ్యోతి) : శ్రీరామనవమి సందర్భంగా ఏపీఎస్‌ఆర్టీసీ, గుడివాడ డిపో నుంచి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలానికి ప్రత్యేక బస్సులను నడపనునట్టు డిపో మేనేజర్ రాజేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీ రాత్రి 9 గంటలకు బస్సు డిపో నుంచి బయలుదేరుతుందని, రిజర్వేషన్ సౌకర్యం కూడా కల్పించినట్లు తెలిపారు. బృందాలుగా ఏర్పడితే బస్సులను నేరుగా వారి వద్దకే పంపిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్లు 91771 01904, 73829 03299కు సంప్రదించాలని కోరారు.

ఆటిజం వ్యాధిపై అవగాహన అవసరం


భవిత కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

పామర్రు, ఏప్రిల్ 02 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు ప్రబలే ఆటిజం రుగ్మతపై తల్లిదండ్రులతోపాటు సమాజంలో ప్రతి ఒక్కరికీ అవగాహన ఎంతో అవసరమని చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ పిసురేష్‌చంద్రా రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎలకుర్రు కేడీబీ ట్రస్టు ఆధ్వర్యంలో నడపబడుచున్న మానసిక దివ్యాంగుల పాఠశాలలో బుధవారం ప్రపంచ ఆటిజమ్ డే ని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా విచ్చేసిన ఆయన మాట్లడుతూ ఆటిజమ్‌కు ప్రధాన కారణం జన్యుపరమైనదిగా భావించాలన్నారు. పిల్లల్లో వయస్సుకు అనుగుణంగా ఉండాల్సిన వికాసం లేకపోవడం, సామాజికంగా నలుగురులో కలిసి ఉండలేని స్థితిలో ఉంటారన్నారు. ఆటిజమ్ వ్యాధిగ్రస్తులకు కేడీబీ ట్రస్టు అందిస్తున్న ప్రత్యేక శిక్షణా తరగతులు అభినందనీయమన్నారు. ఇలాంటి శిక్షణాతరగతుల ద్వారా వారిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కేడీబీ ట్రస్టు నిర్వహక కార్యదర్శి కాశీనాథుని నాగేశ్వరరావు, నిడుమోలు యునియాన్ బ్యాంకు ఎగ్జిక్యూటివ్ శ్రీనివాసరావు, కేడీబీ ట్రస్టు సిబ్బంది పాల్గొన్నారు.

తోట్లవల్లూరు : మానసిక ఎదుగుదల లేని పిల్లలను జాగ్రత్తగా గమనిస్తు వారిని ఆదరించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు కోటయ్య అన్నారు. తోట్లవల్లూరు భవిత కేంద్రంలో బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. 21 రకాల వైకల్యాల్లో ఆటిజం కూడా ఒకటని, వారికి ఫిజయోథెరఫీ చేయిస్తే కొంత ఫలితం ఉంటుందన్నారు. వీరికి దివ్యాంగ విద్యార్థి సమగ్ర శిక్షా ద్వారా అందించే పథకాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్‌చేసి దివ్యాంగులకు తినిపించారు. కార్యక్రమంలో భవిత కేంద్రం టీచర్లు ఎస్ నిరుపమ, హైస్కూల్ టీచర్లు ఉజ్వల, నాగలక్ష్మీ, వల్లూరు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత మృతి

నందివాడ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో దెబ్బలు తగిలి అపస్మారక స్థితిలో వెళ్లిన టీడీపీ సీనియర్ నాయకులు వెంకట రామాపురం గ్రామ మాజీ టీడీపీ అధ్యక్షులు అక్కినేని వెంకటరత్నం గుడివాడ హాస్పటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. మృతుని భౌతికకాయాన్ని టీడీపీ నాయకులు వెనిగండ్ల రామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, చాట్రగడ్డ రవి, యార్లగడ్డ రవి సురేష్, రాధాకృష్ణ, ఏసుపాదం, మనిమక్కు వేణు, టీడీపీ నాయకులు, గ్రామస్థులు నివాళులర్పించారు.

మల్లాయిపాలెం భూముల పరిశీలన

గుడివాడ, ఏప్రిల్ 02(ఆంధ్రజ్యోతి) : గుడివాడ మండలం మల్లాయిపాలెంలోని భూములను ఏపీఐఐసీ జాయింట్ డైరెక్టర్ రాపాక వెంకట్రావు బుధవారం పరిశీలించారు. ఆర్‌ఎస్‌ఆర్‌లో పేర్కొన్న మసీదు భూములను తహసీల్దార్ వి.రామకోటేశ్వరావు, ఆర్ఐ నాగబాబుతో కలిసి పరిశీలించారు. భూములు ఎవరి చేతుల్లో ఉన్నాయో, పంటలు ఎవరు పండించుకుంటున్నారో, మసీదుకు సంబంధించిన ఎంత భూమి ఉందో వివరాలను అడిగి తెలుసుకున్నారు. దాదాపు అందరు 400మంది చిన్న, సన్నకారు రైతులే భూములకు హక్కుదారులుగా ఉన్నారని రెవిన్యూ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌వో గూడపాటి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతపై బైండోవర్ కేసు

తోట్లవల్లూరు : దేవరపల్లికి చెందిన జిల్లా టీడీపీ ఎస్టీ సెల్ మాజీ అధికార ప్రతినిధి సబావతు నాగేశ్వరరావు నాయక్‌పై పోలీసులు బుధవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లోనే ఉంచి, సాయంత్రం తహసీల్దార్ ఎం. కుసుమ కుమారి ఎదుట హాజరు పర్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇద్దరు కానిస్టేబుళ్లు ఇంటికి వచ్చి డీఎస్పీ తీసుకు రమ్మన్నారని స్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. సాయంత్రం వరకు స్టేషన్‌లో కూర్చోపెట్టి తహసీల్దార్ ఎదుట హాజరు పర్చారని చెప్పారు. 2020లో వైసీపీ హయాంలో పేకాట ఆడుతూ పట్టుబడ్డానని, అపుడు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకి హాజరు పర్చగా జరిమానా విధించారన్నారు. అప్పటి నుంచి పేకాట జోలికి వెళ్లటంలేదని ఆయన తహసీల్దార్‌కు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

గుడివాడరూరల్: దొండపాడలోని కోందడ రామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఉదయం 7.30 నిమిషాలకు అఖండ సప్త దిన విష్ణుసహస్రనామ పారాయణపూర్వక మహాయజ్ఞం నిర్వహించారు. సాయంత్రం పూజా కార్యక్రమాలు, తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	153, 162, 173
చికెన్ విత్ స్కిన్	290
చికెన్ స్కిన్‌లెస్	300

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

తాగునీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలి : ఎంపీపీ

కోడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి అన్నారు. కోడూరు మండల సమావేశం బుధవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండల పరిషత్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ నెల 15లోపు తాగునీటికి కాల్వల ద్వారా జలాలు విడుదల కానున్నాయని పంచాయతీ అధికారులు తాగునీటి చెరువులను నింపుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీడీవో సుధాప్రవీణ్, ఎంఈవో శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిషన్ నియమించాలి



కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ప్రదర్శన

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పన్నెండవ పీఆర్సీ కమిషన్ నియమించాలంటూ కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో బుధవారం వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయ నాయకులు, టీచర్లునిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యల సాధనకై ఈ నిరసన ప్రదర్శన నిర్వహించారు. కృష్ణాజిల్లా ఫ్యాప్టో చైర్మన్ అంబటిపూడి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన ఈ నిరసన ప్రదర్శనను ఫ్యాప్టో కృష్ణాజిల్లా సెక్రటరీ జనరల్ కుంపటి రాజేంద్ర ప్రసాద్ ప్రారంభించి ప్రసం గించారు. సీపీఎస్, జీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. 2003 డీఎస్సీ వారిని కూడా పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు మద్ది బాబూరాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, పీఆర్సీ ఇచ్చే వరకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్లు చెల్లించాలని, కారుణ్య నియామకాలు జరపాలని, ఉమ్మడి సర్వీసు రూల్స్ జీవోలను అమలు చేయాలని కోరారు. డిప్యూటీ సెక్రటరీ జనరల్ డి. కనకారావు (యూటీఎఫ్), ఎం.వి.ఎస్.ఎన్. ప్రసాద్ (ఎస్టీయూ), ఇ.వి. రామారావు, దస్తగిరి (ఏపీటీఎఫ్), డి.చంద్రశేఖర్, లంకేశ్వర రావు, హుస్సేన్ ప్రసంగించారు. పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలన్నారు. అనారోగ్యంగా ఉన్న టీచర్లను 10వ తరగతి పరీక్షల మూల్యాంకనానికి మినహాయింపు ఇవ్వాలన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో నాయకులు పి. ఇమ్మానుయేల్, వి. సాంబశివరావు, కెపి ఉమామహేశ్వరరావు, అంబటిపూడి సుబ్రహ్మణ్యం తదితరులు మాట్లాడారు.


పాఠశాలను పరిశీలించిన కలెక్టర్



చినపాండ్రాకలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలజీ

కృత్తివెన్ను, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కృత్తివెన్ను మండలం చినపాండ్రాక, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి గ్రామాలల్లో ప్రైమరీ స్కూల్స్‌ను బుధవారం కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో మోడల్ ప్రైమరీ స్కూల్స్ పట్ల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అవగాహన కల్పించి, వారి అనుమానాలను నివృత్తి చేసారు. జిల్లాలో మోడల్ స్కూల్స్ ఏర్పాటుకు అవకాశం ఉన్న కృత్తివెన్ను మండలం చినపాండ్రాక, కెవినగర్, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి, ఆర్జావానిగూడెం ప్రైమరీ స్కూల్స్‌ను సందర్శించారు. ఒకే పాఠశాలలో 60 మందికి పైగ విద్యార్థులు చదివే పాఠశాలాలను మోడల్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో రామారావు, తహసీల్దార్ పూర్ణచంద్ర, ఎంఈవోలు బాలత్రిపుర సుందరీ, వెంకటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పృథ్వీశ్వరస్వామిని అభిషేకించిన సూర్య కిరణాలు



చల్లపల్లి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : పృథ్వీశ్వరస్వామిని సూర్యకిరణాలు తాకాయి. నడకుదురులో ద్వాపరయుగంతో విడదీ యలేని అనుబంధం కలిగి ప్రాచీన శైవక్షేత్రంగా భాసిల్లుతున్న నరకాసుర సంహార క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత పృథ్వీశ్వరస్వామి దేవస్థానం పశ్చిమఅభిముఖంగా ఉంటుంది. దేవస్థానంలో బుధవారం అరుదైన దృశ్యం సాక్షాత్కరించింది. సూర్యుడు అస్తమించే సమయంలో సూర్యకిరణాలు పృథ్వీశ్వరస్వామిని తాకాయి. స్వామిని సూర్యభగవానుడు తన కిరణాలతో అభిషేకిస్తున్నట్లుగా శ్వేతవర్ణ శివలింగంపై సూర్య కిరణాలు పూర్తిస్థాయిలో పడిన అరుదైన అద్భుతమైన దృశ్యాన్ని భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.



అమ్మవారి హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

లంకమ్మ హుండీ ఆదాయం రూ.4.94 లక్షలు

అవనిగడ్డ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): దివి ప్రాంత వాసుల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారి ఐదు నెలల హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించగా, రూ.4,94,306లు లభించినట్లు ఆలయ ఈవో యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం అవనిగడ్డ అమ్మవారి ఆలయంలో మచిలీపట్నం ఆలయాల తనిఖీ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ లెక్కింపు కార్యక్రమంలో ఈ ఆదాయం లభించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 12న లంకమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం జరుగనున్న నేపథ్యంలో అంతకు ముందే హుండీ ఆదాయాన్ని లెక్కించటం పరిపాటి అని, అందులో భాగంగానే హుండీని లెక్కించినట్లు ఆయన తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ యాసం శ్రీరాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



భక్తిప్రపత్తులతో అమ్మవారికి పొంగళ్లు

కోడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కోడూరులో కొలువై ఉన్న శ్రీ గంగానమ్మ ఆలయ 50వ వార్షిక జాతరలో భాగంగా బుధవారం ఆలయ ప్రాంగణంలో గ్రామ ఆడపడుచులచే పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని పొంగించి అమ్మవారికి నివేదించారు. ఆలయ వద్ద పలువురు స్వచ్ఛందంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కోట యుగంధర్ రావు పర్యవేక్షించగా, జాతర నేపథ్యంలో అమ్మవారికి విశేష అలంకరణ గావించారు.

వినాయక ఆలయం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు

పెడన, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మఠం వీధి (14వ వార్డు)లో గల శ్రీవరసిద్ధి వినాయక ఆలయం వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఎస్‌ఐ జి. సత్య నారాయణ దగ్గరుండి ఆలయ నిర్వాహకులచే ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ, నేరాల నియంత్రణకు, భద్రతను పెంచేందుకు ఆలయం చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించామన్నారు. పట్టణంలోని అన్ని ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయిస్తున్నామని ఆయన తెలిపారు.

వాసవీలో జేఈఈ మెయిన్స్

పెడన రూరల్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జెఈఈ మెయిన్స్ 2025 పరీక్షలు నిర్వహించారు. ఉదయం పరీక్షకు 67మంది విద్యార్థులకుగాను 64 మంది హాజరుకాగా మధ్యాహ్నం పరీక్షలకు 55మందికిగాను 55 మంది హాజరయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బీఆర్ఎస్ రెడ్డి తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు సమయానికి ముందే కళాశాలకు రావాలని సూచించారు.

బీసీ రుణాలకు ఇంటర్వ్యూలు

చల్లపల్లి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : బీసీ వార్షిక ప్రణాళికలో భాగంగా బీసీ రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు బుధవారం చల్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉదయం ఆముదార్లంక, నడకుదురు, పురిటిగడ్డ, వెలివోలు, యార్లగడ్డ, పాగోలు, వక్కలగడ్డ, మాజేరు, మంగళాపురం గ్రామాల పరిధిలోనూ, మధ్యాహ్నం నుంచీ లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని దరఖాస్తుదారులకు ఎంపీడీవో ఏవి.రమణ బ్యాంకు అధికారుల సమక్షంలో ఇంటర్వ్యూలు జరిపారు. 10 గ్రామాల పరిధిలో మొత్తం 270 మంది దరఖా స్తుదారుల్లో 209 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఎంపీడీవో ఎవి.రమణ, బ్యాంకు మేనేజర్లు తూము ప్రసన్న, వెంకట్, ఎం.కృష్ణసాయి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నేడు, రేపు ఇంటర్వ్యూలు

నాగాయలంక, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మండలంలో పలు రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 3, 4 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.సుధా ప్రవీణ్ తెలిపారు. బీసీ సామాజిక వర్గాల వారికి 3 న, కమ్మ, కాపు, ఈబీసీ, రెడ్డి, వైశ్యులకు 4న ఉదయం 10 నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని, దరఖాస్తు చేసుకున్న వారు తమ అర్హత సర్టిఫికెట్లతో రావాలని ఆయన కోరారు.



జనసేన జిల్లా అధ్యక్షుడు రామకృష్ణను పరామర్శిస్తున్న మంత్రి నాదెండ్ల

కూటమి ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం

మంత్రి నాదెండ్ల మనోహర్

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలో అందరికీ సమన్యాయం చేకూరుతుందని, క్యూ ఆర్ కోడ్‌తో పేదలకు కొత్త రేషన్‌కార్డులు ఏప్రిల్ తరువాత ఇస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. బుధవారం జనసేన కృష్ణాజిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ తండ్రి బండ్రెడ్డి రామారావు కన్నుమూసిన నేపథ్యంలో బుధవారం నాదెండ్ల మనోహర్ ఇక్కడకు వచ్చారు. రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బండ్రెడ్డి రామకృష్ణను పరామర్శించారు. ఈ సందర్భంగా మనోహర్ కొద్దిసేపు మీడియాతో మాట్లాడారు. రేషన్‌కార్డులకు ఈకేవైసీ ప్రక్రియ పూర్తవుతోందన్నారు. రేషన్‌కార్డులపై గతంలో లాగా సీఎం ఫోటోలు ఉండవన్నారు. దీపం 2పథకం కింద 2వ ఉచిత సిలెం డర్‌కు బుకింగ్ ప్రారంభమైందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చేందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తల కృషి మరువలేమన్నారు.

బీజేపీ మహిళా నేతకు పరామర్శ

నాగాయలంక: పర్రచివరలో ఇటీవల బీజేపీ సీనియర్ నాయకురాలు భోగాది రమాదేవి భర్త భోగాది మహేంద్ర భాస్కరావు మృతి చెందగా, బుధవారం సంస్మరణ కార్యక్రమం జరిగింది. భాస్కరరావు చిత్రపటానికి జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, సీనియర్ నాయకులు అన్నపరెడ్డి వెంకటస్వామి నివాళుల ర్పించారు. రమాదేవిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కూటమితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే కృష్ణప్రసాద్



రామరాజుపాలెం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత

గూడూరు, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమం, అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వం దూసుకుపోతుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మంగళవారం గూడూరుఆసుపత్రిలో పి.మహాలక్ష్మయ్య, జేజమ్మ ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ఫిల్టర్‌ను మంగళవారం ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారం భించారు. అలాగే గూడూరు మెయిన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రంను, రామరాజుపాలెం, ఐదుగుళ్ళపల్లి గ్రామాల సచివాలయాలు, మల్లవోలు సెంటర్‌లో చలివేంద్రం, రామన్నపేటలో సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పోతన స్వామి, జనసేన నాయకులు పంచకర్ల సురేష్, సర్పంచ్‌లు లింగం సులోచనారాణి, పరసా రాజులు, మొహమ్మద్ రఫీ, గోవాడ ప్రేమ్‌కుమార్, కూటమి నాయకులు గోపీ నాగబాబు, అన్నం హరిరామకృష్ణ, కాసగాని శ్రీనివాసరావు, కట్టా మునీశ్వరరావు, పోతన రామోజీ, గంజాల కృష్ణమోహన్, బాసంశెట్టి శ్రీనివాసరావు, పోతుల రాము, మురాల ధనుష్, గొరిపర్తి ఫణిరాజు, బేతాళ స్వామి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ కృష్ణాజిల్లా, చల్లపల్లి మండలం, చల్లపల్లి గ్రామ కాపురస్తుడు కందుల సహదేవుడు గారి కుమారుడు కందుల పద్మారావు గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియ జేయునది ఏమనగా : నా క్లయింటు తన సోదరుడు కందుల ప్రసాద్ గారి వద్ద ది.19-03-2009వ తారీఖున చల్లపల్లి గ్రామంలో ఆర్.యస్.నెం. 230- 8ఎ, 236-1ఎ నందు గల యు.0-171/2ట్లు మాగాణి భూమిని కొనుగోలు చేసి అదేరోజు చల్లపల్లి రిజిస్టర్ ఆఫీసు నందు దస్తావేజు నెం. 170/2009రు గల క్రయదస్తావేజును రిజిస్టర్ చేయించుకొనియున్నారు. నా క్లయింటు కందుల పద్మారావు గారు సదరు దస్తావేజును జిరాక్సు తీయించుకునే నిమిత్తం ది.26-02-2025వ తేదీన తన గృహము నుండి చల్లపల్లి మెయిన్ సెంటర్కు వెళ్ళుచుండగా సదరు ఒరిజినల్ దస్తావేజు పోయినది. సదరు దస్తావేజు ఎవరికైనా దొరికినయెడల నా క్లయింటుకుగాని, ఈ క్రింది అడ్రస్సుకుగాని అందజేయవలసినదిగా కోరుకొనుచున్నాను.

చల్లపల్లి, ది.01-04-2025

ఇట్లు, **తుటారం ప్రసాద్**, M.A., L.L.B., న్యాయవాది, పోలీస్‌స్టేషన్ బజార్ - చల్లపల్లి. సెల్ : 9440482177

ఇళ్లు కోల్పోయిన వారికి స్థలాలు ఇస్తాం : టీడీపీ

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): శివగంగ ప్రాంతంలో రోడ్ల మూల మలుపుల్లో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉన్న ప్రాంతాల్లో ఆక్రమణలను తొలగించి ప్రత్యామ్నాయంగా ఇళ్లస్థలాలు, ఇళ్లు ఇచ్చేందుకు మంత్రి వాగ్దానం చేశారని, దీన్ని వైసీపీ నాయకులు పేర్ని కిట్టు తదితరులు రాజకీయం చేయడం దురదృష్టకరమని మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా, కార్యదర్శి పిప్పళ్ల కాంతారావులు అన్నారు. బుధవారం మచిలీపట్నం నగర టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ, శివగంగ డ్రెయిన్ పక్కన నివసిస్తున్న ఇంటి యజమానులు మంత్రి కొల్లు రవీంద్రను కలిశారని, వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మంత్రి రవీంద్ర హామీ ఇచ్చారని దీతో దాలిపర్తి దుర్గాప్రసాద్, దాలిపర్తి సాయి, గోపు జనార్ధన, గంజాల ఆంజనేయులు స్వచ్ఛందంగా తమ ఇళ్లను తొలగించారన్నారు. ఇద్దరు కోర్టుకు వెళ్లి స్టే తీసుకువచ్చారని, వారి సమస్యను పరిష్కరిస్తానని మునిసిపల్ అధికారులు వాగ్దానం చేశారన్నారు. అయినప్పటికీ వైసీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిం చారన్నారు. చిలకలపూడిలో ఎక్కడా లేని విధంగా 130 అడుగుల రోడ్డు విస్తరణ కార్యక్రమం చేపట్టారని, దాని వలన పేదలు నష్టపోలేదా అని టీడీపీ నాయకులు దిలీప్, కార్పొరేటర్ దేవరపల్లి అనిత తదితరులు ప్రశ్నించారు. గతంలో రోడ్ల పక్కన ఎన్నో షాపులను పడగొట్టారని, ఆ వ్యాపారులకు అప్పటి ఎమ్మెల్యే పేర్ని నాని ఏవిధమైన నష్టపరిహారం చెల్లించలే దన్నారు. మూడు స్తంభాల సెంటర్ నుంచి రైల్వేస్టేషన్ వరకు రోడ్డు విస్తరణ కార్యక్రమం జరుగు తున్న సమయంలో నష్టపోయిన వ్యాపారులకు మంత్రి కొల్లు రవీంద్ర ప్రప్రథమంగా బాండ్లు ఇప్పిస్తున్నారన్నారు.

అవనిగడ్డలో రేషన్ బియ్యం స్వాధీనం

అవనిగడ్డ, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ సమీపంలో కటికల రామారావు వద్ద నుంచి కోసూరు రాజారావు కొనుగోలు చేసి అక్రమ మార్గంలో తరలించేందుకు ఉంచిన రేషన్ బియ్యాన్ని ఎస్‌ఐ కె.శ్రీనివాసరావు బుధవారం పట్టుకున్నారు. ఈ ఘటనలో కటికల రామారావు, కోసూరు రాజారావులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

దంపతుల మధ్య వివాదం.. భార్య ఆత్మహత్య

మోపిదేవి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తెకు నూతన వస్త్రాలు ఫంక్షన్ నిర్వహించే నిమిత్తం భార్యాభర్తల మధ్య స్వల్ప వివాదం ఏర్పడగా, భార్య లక్ష్మీకుమారి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన మోపిదేవి పంచాయతీ శివారు మోపిదేవి వార్పు వద్ద జరిగింది. కోసూరువారిపాలెం గ్రామానికి చెందిన లక్ష్మీకుమారికి గరికపాటి రమేష్‌తో 18సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి పాప ఉండగా, ఓణీల ఫంక్షన్ నిర్వహించే నిమిత్తం భార్యభర్తలు మంగళవారం రాత్రి ఇంట్లో చర్చించుకోగా, ఇరువురి మధ్యస్వల్ప వివాదం ఏర్పడింది. భోజనం అనంతరం లక్ష్మీకుమారి ఒక గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకోవటం జరిగింది. కుటుంబ సభ్యులు గమనించి తలుపులు పగలకొట్టి అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలు లక్ష్మీ సోదరులు భోగిరెడ్డి శివభాను కృష్ణ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోపిదేవి ఎస్‌ఐ వై.వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

రైలుకింద పడి వ్యక్తి మృతి

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నంకు కొండవీడు ఎక్స్‌ప్రెస్ వస్తున్న నేపథ్యంలో చిలకలపూడి రైల్వేస్టేషన్ ప్లాట్ ఫారంపై ఒకగుర్తుతెలియని 40ఏళ్ల వ్యక్తి రైలు కిందకు దూకి మృతి చెందాడు. లోకో పైలెట్ ఫిర్యాదు మేరకు గుడివాడ రైల్వే ఎస్‌ఐ ఎండి షరీఫ్ కేసు నమోదు చేశారు. మృతుడు చామనచాయ రంగు కలిగి 5.5 ఎత్తు ఉన్నాడు. ఎరుపు, పసుపురంగు ఫుల్ హ్యాండ్ గళ్ళ చొక్కా, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. వివరాలు తెలిస్తే 9440627050, 7396069566 సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యదాయకం

మోపిదేవి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం పెరుగుతున్న పోటీ ప్రపంచంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ధాన్యాలు మేలైన ఆరోగ్యాన్ని ఇస్తాయని బొబ్బర్లంక సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని తెలిపారు. బుధవారం మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో ప్రకృతి వ్యవసాయం, ఖరీఫ్ కార్యాచరణ ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మేలైన సమాజ స్థాపనకై బొబ్బర్లంక గ్రామంలో ఉన్న ప్రతీ ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో భాగంగా ప్రకృతి వ్యవసాయం, సాధా రణ వ్యవసాయానికి గల తేడాలను ప్రదర్శనాపూర్వకంగా వివరించారు. సిబ్బంది అవగాహన కల్పించారు. ఉద్యానశాఖ సచివాలయ ఉద్యోగి బాలాజీ, ఐసిఆర్‌పి నరసింహారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బుజ్జమ్మ, నాంచారమ్మ, డిఆర్‌పి పి.సురేష్ తదితరులు ఉన్నారు.

డ్రెయిన్లలో పూడికతీత పనులు



మోపిదేవి, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి) : పెదకళ్లేపల్లి నుంచి ఉన్న మంగళవాని శింకులో రూ.35.45లక్షలతో పిచ్చిమొక్కల తొలగింపు ప్రారంభించారు. కలెక్టర్ ప్రత్యేక నిధులతో 4.5 కిలోమీ టర్ల మేర డ్రెయిన్‌లో ఏపుగా పెరిగి అల్లుకున్న కిక్కిస మొక్కల తొలగింపు పనులు చేయనున్నట్లు ఏఈ చిరంజీవి తెలిపారు.

కృత్తివెన్ను : కొమాళ్ళపూడి పంట కాలువ పూడికతీత పనులను బుధవారం జడ్పీటీసీ సభ్యుడు ఒడుగు తులసీరావు, డీసీ చైర్మన్ నెక్కంటి భాస్కరరావులు ప్రారంభించారు. ప్రభుత్వ నిధులతో కాలువ పూడిక తీత పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు కూనసాని శ్రీనివాసరావు, అశోక్, వాసు, పత్తిపాటి రామాంజనేయులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆటిజం డే

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి) : ఆటిజం కలిగిన పిల్లలపట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటూ భవిత కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఆటిజం డే సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీలో సిఆర్‌ఎంటి సూరమ్మ, షేక్ గౌసియా, ఆర్‌పి జి. స్వాతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నాగాయలంక : నాగాయలంక కె.పాలెం పాఠశాల విద్యార్థులు పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు వి.బాలయ్య, కిశోరకుమారి, దివ్యాంగుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, గొడుగుపేట, మచిలీపట్నం

బహిరంగ కౌలు వేలంపాట ప్రకటన

కృష్ణాజిల్లా, మచిలీపట్నం, గొడుగుపేటలో వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానమునకు సర్వ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగియున్న కృష్ణాజిల్లా, గుడ్లవల్లేరు మండలం, వడ్లమన్నాడు గ్రామంలో గల ఈ దిగువ షెడ్యూలు దాఖలా వ్యవసాయ భూమి సాగు హక్కు 3 సంవత్సరముల కాలపరిమితికి అనగా 2025-2026 నుండి 2027-2028 వరకు వడ్లమన్నాడు గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో దేవదాయ శాఖ అధికారుల సమక్షమున ది. 10-04-2025 గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలము జరుపబడును.

షెడ్యూలు

వ. నెం.	గ్రామము పేరు	రీ. స. నెం.	విస్తీర్ణం య.సెం.	మాగాణి	ప్రథమ ధరావత్తు	కాలపరిమితి
1.	వడ్లమన్నాడు	386/1బి	0-79	మాగాణి	రూ.50,000/-	2025 - 2026 నుండి 2027-2028 వరకు
2.	వడ్లమన్నాడు	383	16-41	మాగాణి		
3.	వడ్లమన్నాడు	612	0-80	మాగాణి		
	మొత్తం భూమి		18-00			
4	వడ్లమన్నాడు	427/1	0-07	హౌస్ సైట్	రూ.5,000/-	

షరతులు : 1. సదరు బహిరంగ వేలం పాట దేవదాయశాఖ అధికారుల ఆమోద ఉత్తర్వులకు లోబడి జరుగును. 2) సదరు బహిరంగ వేలం పాట ఖరారైన మొత్తమును అడ్వాన్స్ గా 48 గంటల లోపు నగదు రూపములో చెల్లించే నిర్ణయము. 3) బహిరంగ వేలంపాటలో ప్రతి పాటదారుడు హామీ నిమిత్తము పట్టాదారు పాస్‌బుక్ టైటిల్ డీడ్ మరియు ఆధార్ కార్డు తప్పనిసరిగా దాఖలు చేయవలెయును. 4) ఈ బహిరంగ వేలంలో పాల్గొను పాటదారులు బహిరంగ వేలం ప్రకటన నందు ఉదహరించిన ప్రథమ ధరావత్తు సొమ్మును నగదు రూపములో చెల్లించి బహిరంగ వేలం పాటలో పాల్గొనవలెను. హెచ్చు పాటదారుని సొమ్మును మినహా మిగిలిన పాటదారులు సొమ్ము తిరిగి ఇవ్వబడును. హెచ్చు పాటదారుడి ప్రథమ ధరావత్తు సొమ్మును కౌలు కాల పరిమితి ముగిసిన తరువాత తిరిగి చెల్లించబడును, ఇందుకు ఎటువంటి వడ్డీని దేవస్థానం వారిచే చెల్లించబడదు. 5) దేవస్థానమునకు ఏ విధమైన బకాయి ఉన్నవారు గాని, ఇతర కోర్టు లావాదేవీలు ఉన్నవారు గాని వేలంపాటలో పాల్గొనరాదు.

మచిలీపట్నం, ది.1-04-2025 — శ్రీ స్వామి వారి సేవలో కె.వి. గోపాలరావు, కార్యనిర్వహణాధికారి